ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
ఏలూరు
జిల్లా వార్తలు
5
శుక్రవారం 26 జూలై 2024



ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 32.0
కనిష్ఠం : 25.0

నరసాపురం టు మచిలీపట్నం
కొత్త రైల్వే లైన్ సర్వేకు పచ్చ జెండా



- బ్రిటీష్ కాలం నాటి ప్రతిపాదనలపై కదలిక
- కోటిపల్లి-నరసాపురం లైన్‌కు రూ.300 కోట్లు
- వేగవంతం కానున్న రైల్వే ట్రాక్ పనులు
- రైల్వే బడ్జెట్‌లో తీర ప్రాంతానికి వరం
- రూపురేఖలు మారనున్న నరసాపురం ముఖచిత్రం

నరసాపురం, జూలై 25 : సముద్ర తీరం వెంబడి కొత్త రైల్వే లైన్ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. బ్రిటీష్ హయాం నుంచి ప్రతిపాదనలకే పరిమితమైన నరసాపురం-మచిలీపట్నం మధ్య లైన్‌కు సర్వే చేయాలని నిర్ణయించింది. మంగళవారం సమర్పించిన 2024-25 కేంద్ర బడ్జెట్‌లో ఈ మేరకు ప్రతిపాదనలు చేసినట్లు రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. ఈ పనులు పూర్తయితే నరసాపురం పెద్ద జంక్షన్‌గా మారనుంది. చివరి స్టేషన్ అన్న పేరు నుంచి తప్పుకోనుంది. ఇప్పటికే నరసాపురం నుంచి భీమవరం మీదుగా నిడదవోలు, గుంటూరు, విజయవాడ, నాగర్‌సోల్, బెంగళూరు, హుబ్లి, ధర్మవరం, లింగంపల్లి, హైదరాబాద్‌కు రాకపోకలు సాగిస్తున్నాయి. మరోవైపు కోటిపల్లి-నరసాపురం రైల్వే లైన్ పూర్తయితే నరసాపురం జంక్షన్ అవుతుంది. కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా జిల్లావాసులు స్వాగతిస్తున్నారు. మచిలీపట్నం-నరసాపురం మార్గాన్ని రైల్వే రూట్‌లో కలపాలని బ్రిటిష్ హయాంలోనే ప్రతిపాదించారు. దీనిని పట్టాలెక్కించేందుకు మోదీ సర్కార్ ఫైనల్ లొకేషన్ సర్వేకు ఆదేశించింది. 69 కిలోమీటర్ల మేర కొత్త లైన్‌కు పలుచోట్ల ఉప్పుటేర్లపై వంతెనలు వేయాల్సి ఉంది. ఈ కారణంగా భారీ వ్యయం అవుతుందని అప్పట్లో ఈ ప్రతిపాదనను పెండింగ్ పెట్టారు. ప్రస్తుతం రైలులో మచిలీపట్నం వెళ్లాలంటే గుడివాడ వెళ్లి అక్కడి నుంచి రైలు మారాలి. అదే నరసాపురం నుంచి మచిలీపట్నం పూర్తయితే మొగల్తూరు, బంటుమిల్లి మీదుగా వెళ్లవచ్చు. దీనివల్ల కోస్తా తీరం వెంబడి రైలు మార్గం ఏర్పడుతుంది. ఇప్పటికే కోటిపల్లి రైల్వేలైన్ వల్ల కాకినాడ నుంచి నరసాపురం వరకు రైలు మార్గం ఏర్పడింది. ఇటు మచిలీపట్నం పూర్తి చేస్తే సముద్ర తీరం వెంబడి రైలు కూత వినిపిస్తుంది. ప్రస్తుతం ఈ బడ్జెట్‌లో సర్వే పనులు చేపడుతున్నట్లు రైల్వే మంత్రి ప్రకటించారు. ఈ ప్రాజెక్టు పట్టాలెక్కితే నరసాపురం స్టేషన్ పెద్ద జంక్షన్‌గా మారడంతోపాటు చివరి స్టేషన్ అన్న మార్క్ నుంచి తొలగనుంది.


కోటిపల్లికి రూ.300 కోట్లు..

ఈ ఏడాది ఫిబ్రవరిలో ప్రకటించిన రైల్వే బడ్జెట్‌లో కోటిపల్లి రైల్వేలైన్‌కు రూ.300 కోట్లు కేటాయించారు. ఈ నిధులను పూర్తి స్థాయిలో వినియోగించి ప్రాజెక్టు పనులను వేగవంతం చేస్తామని కేంద్ర రైల్వే శాఖ మంత్రి ప్రకటించారు. ఇప్పటి వరకు ఈ ప్రాజెక్టుకు బడ్జెట్‌ల్లో రూ.1,150 కోట్లు కేటాయించారు. ప్రస్తుతం రూ.300 కోట్లతో రూ.1,450 కోట్లకు చేరింది. ఈ నిధులకు రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా 25 శాతం చెల్లించాల్సి ఉంటుంది. ఇప్పటి వరకు రాష్ట్రం ఇచ్చిన వాట మొత్తం రూ.50 కోట్లు మాత్రమే అది కూడా 2019కి ముందు. గత ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా ఈ ప్రాజెక్టుకు కేటాయించలేదు. ఈ కారణంగా పనులు ముందుకు సాగలేదు.

51 కిలోమీటర్ల మేర చేపట్టే ఈ కొత్త రైల్వేలైన్ వల్ల కోనసీమ జిల్లాలోని అమలాపురం, రాజోలుకు రైలు మార్గం ఏర్పడనుంది. దీంతోపాటు విశాఖ, రాజమండ్రి మధ్య మెయిన్‌లైన్‌లో ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు ప్రత్యామ్నాయ మార్గం ఏర్పడనుంది. ఇప్పటికే ఈ ప్రాజెక్టులో మూడు భారీ వంతెనలు చివరి దశకు చేరుకున్నాయి. భూసేకరణ కూడా 75 శాతం పూర్తయింది. నిధులు పూర్తి స్థాయిలో ఉంటే ట్రాక్ పనులు వేగవంతం కానున్నాయి.







కుక్కునూరు మండలం కివ్వాక చెరువు ఆయకట్టు ప్రాంతంలో నీట మునిగిన పొలాలు

మళ్లీ గోదావరి

- భద్రాచలం వద్ద రెండో ప్రమాద హెచ్చరిక జారీ
- సురక్షిత ప్రాంతాలకు లోతట్టు ప్రాంతాల ప్రజల తరలింపు
- వేలేరుపాడులో జేసీ పర్యటన

కుక్కునూరు/వేలేరుపాడు/పోలవరం/ జంగారెడ్డిగూడెం జూలై 25 : గోదావరి దోబూచులాడుతోంది. బుధవారం నెమ్మదించిన గోదావరి గురువారం మరలా పెరిగి భద్రాచలం వద్ద 48.5 అడుగులకు చేరడంతో రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. ఈ క్రమంలో అధికారులు లోతట్టు ప్రాంతాల్లో ఉన్న గ్రామాలకు వెళ్లి ప్రజలను అప్రమత్తం చేశారు. ఎవరూ గోదావరి సమీపంలోకి, చేపల వేటకు వెళ్లవద్దని వ్యవసాయ పనులు ఆపాలని సూచిం చారు. కుక్కునూరు మండలం లచ్చిగూడెం, గ్రామానికి చెందిన 140 కుటుంబాలు, కొమ్ము గూడెంకు చెందిన 250 కుటుంబాలు, కౌండిన్య ముక్తికి చెందిన 38 కుటుంబాలను ఇప్పటికే పునరావాస కాలనీలకు తరలించిన విషయం విదితమే. వారికి నిత్యావసర సరుకులు, కూరగాయలు పంపిణీ చేశారు.

పోలవరంలో తహసీల్దారు కార్యాలయానికి వెళ్లే రోడ్డు మార్గానికి ఇరువైపులా పంట పొలాలు కొండవాగుల వరద నీటిలో మునిగి ఉన్నాయి. గోదావరి నీటిమట్టం తగ్గకపోవడం, కడెమ్మ స్లూయిజ్ గేట్లకు గోదావరి వరద జలాల పోటు కారణంగా గేట్లు పూర్తిగా మూసుకుపోయి ఏటిగట్టుకి కుడివైపున ఉన్న సుమారు రెండు వేల ఎకరాల్లో వరినాట్లు నీటమునిగాయి ఏటా ఇదే పరిస్థితి ఎదురవు తోందని, పట్టిసీమ ఎత్తిపోతల పథకంలో ఉప యోగించే పెద్దమోటారుని కడెమ్మ స్లూయిజ్ వద్ద ఏర్పాటు చేసి వరద జలాలను తోడి గోదావరిలోకి పంపడం వల్ల పంటపొలాలు నీటమునిగే అవకాశాలుండవని చెబుతున్నారు.



పోలవరంలో నీటమునిగిన పంట పొలాలు

పట్టిసీమ నీటి విడుదల ప్రారంభం

పోలవరం జూలై 25 : పట్టిసీమ ఎత్తిపోతల పథకం నుంచి నీటి విడుదలను గురువారం పునఃప్రారంభించారు. పోలవరం ప్రాజెక్టు కుడి కాల్వకు 3,540 క్యూసెక్కుల జలాలు విడుదల చేసినట్టు పట్టిసీమ ఎత్తిపోతల పథకం డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీరు పెద్దిరాజు తెలిపారు. ఈ నెల 4న నీటిని విడుదల చేయగా వర్షాలు, వరదల కారణంగా కృష్ణా డెల్టాలో నీటి నిల్వలు సమృద్ధిగా ఉండడంతో ఈ నెల 19న నిలిపి వేశారు. గోదావరి నీటిమట్టం 14 మీటర్లకు పైబడి ఉండడం కృష్ణా, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలకు సాగు నీటి అవసరాల రీత్యా మళ్ళీ నీటి పంపిణీ ఆరంభించినట్టు డీఈఈ తెలిపారు.

ఎర్రకాల్వ జలాశయంలోకి వరదనీరు

జంగారెడ్డిగూడెం మండలం కొంగువారిగూడెం శ్రీ కరాటం కృష్ణమూర్తి ఎర్రకాల్వ జలాశయంలోకి వరద నీరు స్వల్పంగా వచ్చి చేరుతోంది. గురువారం గంటకు 1,733 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుండగా జలాశయం గేట్ల ద్వారా 1,733 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేసినట్టు ఇరిగేషన్ డీఈ రాంబాబు తెలిపారు. జలాశయం నీటిమట్టం 83.50 మీటర్లు కాగా ప్రస్తుతం 81.10 మీటర్లు ఉన్నట్టు తెలిపారు.



కటుకూరులో గ్రామస్థులతో మాట్లాడుతున్న జేసీ ధాత్రిరెడ్డి

అప్రమత్తంగా ఉండండి
జేసీ ధాత్రిరెడ్డి

'గోదావరి వరద మళ్లీ పెరుగుతుండడంతో అధికారులు, ముంపు గ్రామాల ప్రజలు అప్రమతంగా ఉండాలి.. లోతట్టు గ్రామాల్లో ప్రజలు తక్షణమే ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు తరలించేందుకు చర్యలు తీసుకోవాలి' అని జిల్లా జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి అధికారులను ఆదేశించారు. వేలేరుపాడు మండలంలో వరద పరిస్థితిని గురువారం పరిశీలించారు. తహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో సమావేశమై అధికారులకు సూచనలు చేశారు. ఆమె మాట్లాడుతూ.. 'అధికారులు అప్రమత్తంగా ఉండి పునరావాస కేంద్రాల్లో ప్రజలకవసరమైన తాగు నీరు, నిత్యవసర వస్తువులు అందించాలి. బయట ప్రాంతాల నుంచి పశుగ్రాసం కొనుగోలు చేసి రైతులకు అందించాలి. పునరావాస కేంద్రాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలి' అని ఆదేశించారు. కటుకూరుకు బోటుపై వెళ్లి గ్రామస్థులను పరామర్శించారు. జేసీ వెంట ఆర్డీవో అద్దయ్య, జడ్పీ సీఈవో సుబ్బారావు, సివిల్ సప్లయిస్ జిల్లా మేనేజర్ మంజుభార్గవి, జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి ఆర్ఎస్ఎస్. రాజు, తహసీల్దార్ చిన్నారావు, ఎంపీడీవో శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు.

ముఖం చాటేశారు..



వరద ప్రాంతాల్లో వైసీపీ నేతలెక్కడ?

- బాధిత కుటుంబాలను ఓదార్చని వైనం
- గడిచిన ఐదేళ్లలోనూ ముంపు మండలాల పట్ల ఇలాంటి నకిలీ ప్రేమనే
- ఆనాడు ఇస్తానన్న సాయం ఇప్పటికీ గతిలేదు
- బాధితులకు అండగా నిలిచిన కూటమి నేతలు
- భారీ వరదలో ప్రయాణించి బాధితుల వద్దకు

(ఏలూరు, ఆంధ్రజ్యోతి ప్రతినిధి):

అధికారంలో ఉన్నాళ్ళు వరదొచ్చినా, వాగొచ్చినా మేమున్నామంటూ గొప్పలు చెప్పేవారు. తూతూమంత్రంగా పర్యటించి అప్పటికప్పుడే వరద వరాలు ఇచ్చేసేవారు. తమ పాలనలోనే బాధితులను ఆదుకుంటామని, మిగతా పార్టీలేవి ఈ వంక చూడవంటూ నిందలు వేసేవారు. ఇలా ఐదేళ్లపాటు ముంపు మండలాల్లో బులుగు వీరులు తెగరెచ్చిపోయారు. కాని వరుసగా వరదలు వచ్చినప్పుడు చేస్తామన్న సాయం చేయనే లేదు. సాక్షాత్తు గతంలో సీఎం హోదాలో జగన్ ఆయా ప్రాంతాల్లో పర్యటించినా ఇస్తామని చెప్పిన ఆర్థిక సాయం పదవి దిగేంతవరకు పట్టించుకోనే లేదు. మళ్ళీ ఎడాపెడా వరదలకు వందలాది కుటుంబాలు ప్రాణభయంతో కొండలు, గుట్టల మీద పిల్లాపాపలతో తలదాచుకుంటున్నా.. వైసీపీ తరఫున కనీసం పలకరించడానికి ఎవరు ఆవైపు కన్నెత్తి చూడలేదు. ఇది ఆ పార్టీకి ప్రజల పట్ల ఉన్న అసలు సిసలైన నకిలీ ప్రేమ! పోలవరం ప్రాజెక్టు కోసం సర్వం త్యాగం చేసిన గ్రామాలు అవి. గడిచిన ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు కుక్కునూరు, వేలేరుపాడు ముంపు మండలాల్లో తరచూ వరద ముంచెత్తింది. ఏ క్షణాన వైసీపీ అధికారంలోకి వచ్చిందో గాని 2019 నుంచే ముంపు మండలాలపై తరచూ వరద పోటెత్తింది. అప్పటికే కొన్ని గ్రామాలను ఖాళీ చేయాలని, మరికొన్ని గ్రామాలను కాంటూరు పరిధిలోకి వచ్చినా పోలవరం ప్రాజెక్టులో నీటినిల్వ సామర్థ్యం తక్కువ చేసి చూపుతున్నందున ఈ గ్రామాలతో మాకు పనిలేదు అన్నట్లుగా పెదవి విరుపులు. 2019లో భద్రాచలం వద్ద గోదావరి వరద ప్రమాదస్థాయికి చేరినప్పుడు ఈ రెండు మండలాల్లోనూ పదుల సంఖ్యలో గ్రామాలను ఖాళీ చేసి సహాయ శిబిరాలకు తరలించారు. పోలవరం ప్రాజెక్టుకు సర్వం త్యాగం చేసిన దానికి ప్రతిఫలంగా జీలుగుమిల్లి, పోలవరం మండలాల్లో ప్రత్యేక కాలనీలు నిర్మించి అక్కడకు తరలించాలని అధికారులు ఒత్తిడి పెంచారు. 2020 ఆగస్టులో గోదావరి పోటెత్తి భద్రాచలం వద్ద 61 అడుగులకు చేరింది. మళ్ళీ 2022లో గోదావరి ఉగ్రరూపం ప్రదర్శించింది. అప్పట్లో భద్రాచలం వద్ద 71 అడుగుల మేర నీటిమట్టం నమోదు కావడమే కాక, అత్యధికంగా వరద వచ్చింది. దీంతో ఈ రెండు మండలాల్లోనూ వ్యవస్థ అస్తవ్యస్తమైంది. గడిచిన ఐదేళ్ళల్లో అత్యధిక వర్షపాతం వరద నమోదైంది ఆ ఏడాదే. తర్వాత 2023లో, ఇప్పుడు తాజాగా జూలైలో వరద మళ్లీ పోటెత్తింది. దీనికితోడు పెద్దవాగు ప్రాజెక్టుకు గండి పడడంతో వేలేరుపాడు మండలం సర్వనాశనమైంది. ఈ ఐదేళ్లలో వరద నేపథ్యంలో ఈ రెండు మండలాల ప్రజలు చవిచూసిన కష్టాలు మరెవ్వరూ చూడనే లేదు.

ఎన్నికలప్పుడు ప్రేమ ఆ తర్వాత ఏదీ..?

ఒకప్పుడు అధికారం వెలగబెట్టిన వైసీపీ ఎప్పుడు వరదొచ్చినా, వాగు వచ్చినా మొసలి కన్నీరుతోనే సరిపెట్టేసింది. గడిచిన ఐదేళ్లల్లో మాట ఇస్తే మడం తిప్పనంటూ బేషజాలకు పోయిన జగన్ ఈ రెండు ముంపు మండలాలను పూర్తిగా వంచించారు. 2022లో భారీ వరదలు తగ్గుముఖం పట్టిన తర్వాత వేలేరుపాడు మండలం సన్నాయిగుట్ట వద్దకు వచ్చి తూతూమంత్రంగా పర్యటించారు. వరద బాధితులకు తక్షణ సాయంగా ఒక్కో కుటుంబానికి రూ.10 వేలు ఇస్తామంటూ అప్పట్లో సీఎం హోదాలోనే జగన్ వరాలు ఇచ్చేశారు. రెండు నెలలు గడిచాకా కేవలం కొన్ని కుటుంబాలకే పదివేలు ఆర్థిక సాయం ఇచ్చి, మిగతా కుటుంబాలను గాలికి వదిలేశారు. అంతకు ముందు అధికారంలోకి రాకమునుపు ప్రతి కుటుంబానికి రూ.10 లక్షలు పరిహారం అందేలా చూస్తానని హామీ ఇచ్చి దాదాపు నాలుగున్నరేళ్ల కాలం గడిపేసి తన పాలనలో చివరి ఐదునెలల్లో ప్రత్యేక జీవో జారీ చేశారు. పోని అదైనా నెరవేరిందా అంటే అదీ లేదు. వైసీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లలో నాలుగేళ్ల గోదావరి వరదలు వచ్చి జనం నష్టపోయినా పరిహారం ఏ ఒక్కరికి సంతృప్తిగా అందనే లేదు.

బాధితులకు అండగా కూటమి నేతలు

వారం రోజులుగా రెండు విలీన మండల ప్రజలు వరద ముంపులో మునిగి తీవ్రంగా నష్టపోయి బావురుమంటున్న కనీసం ఓదార్చేందుకు ప్రతిపక్ష వైసీపీ నేతలు ఎవరూ సాహసించనే లేదు. పోలవరం నుంచి దఫదఫాలుగా గెలిచినా మాజీ ఎమ్మెల్యే కాని ఆయన ముఖ్య అనుచరులు, స్థానిక నేతలు ఎవరూ ముంపు మండలాల వైపు కన్నెత్తి చూడలేదు. మరోవైపు వారం రోజులుగా ప్రజలు పడుతున్న కష్ట నష్టాలను తెలుసుకునేందుకు అటు అధికారులు, ఇటు కూటమి నేతలు గ్రామాలకు వెళ్లి వరద బాధితులకు ధైర్యం చెప్పి తమకు తోచిన సాయాన్ని అందజేశారు. ఎంపీ మహేష్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యే చిర్రి బాలరాజుతో సహా కలెక్టర్ వెట్రిసెల్వి, ఎస్పీ శివ కిషోర్ అధికార బృందాలతో కలిసి లోతట్టు ప్రాంతాల్లో పర్యటించారు. మేమున్నామంటూ భరోసా, ధైర్యాన్ని బాధితులకు అందించారు. కాని వైసీపీ నేతలు అధికారం పోయింది కదా అని ప్రజలపై కక్ష పెంచుకున్నట్లుగా ముంపు మండలాల వైపు కన్నెత్తి చూడలేదు. అయితే తాజాగా గురువారం కొంతమంది వైసీపీ నేతలు అక్కడక్కడ బాధితులకు అన్నదానం, బిస్కెట్లు ఇతరత్రా అందజేశారు. ఎన్నికల వేళ ప్రేమ ఒలకపోస్తూ తర్వాత కష్టకాలంలో చడీ చప్పుడు లేకుండా సైలెంట్ అవ్వడం వైసీపీకే చెల్లింది.

లెక్కలు తేలుస్తున్నారు

- ఇసుక అక్రమ రవాణాపై విచారణ
- పదిమంది సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ
- స్టాక్ పాయింట్ల వద్ద మైనింగ్, ల్యాండ్ సర్వే బృందం తనిఖీలు
- అక్రమాలకు పాల్పడిన వారిపై వీఆర్వో, పంచాయతీ కార్యదర్శులు ఫిర్యాదు
- స్టాక్ పాయింట్లను పరిశీలించిన జేసీ ధాత్రిరెడ్డి

కుక్కునూరు, జూలై 25 : ఇసుక అక్రమ రవాణాపై విచారణ లోతుగా జరుగుతోంది. వింజరం, ఇబ్రహీంపేట, ఇసుక స్టాక్ పాయింట్ల వద్ద గురువారం మైనింగ్, ల్యాండ్‌సర్వే ఏడీ, నీటి పారుదల, పంచాయతీరాజ్, ట్రాన్స్‌పోర్టు అధికారులు విచారణ జరిపారు. ఇసుక స్టాక్ నిల్వలను పరిశీలించారు. ఇసుక పాలసీ అమలులోకి వచ్చిన తర్వాత మైనింగ్ శాఖ కుక్కునూరు మండలం వింజరంలో నాలుగు వేల మెట్రిక్ టన్నులు, ఇబ్రహీంపేటలో 95 వేల మెట్రిక్ టన్నులు ఉన్నట్టు నివేదికలో పేర్కొంది. అయితే క్షేత్రస్థాయిలో ఇసుక లేకపోవడంతో మళ్లీ రెవెన్యూ శాఖ ఇసుక కొలతలు తీసుకుని అమ్మకాలు ప్రారంభించారు. ఈ క్రమంలో ఇబ్రహీంపేట ఇసుక స్టాక్ పాయింట్ వద్ద నుంచి సాయంత్రం 6గంటల తర్వాత 20 టన్నుల పరిమితికి మించి అధికంగా ఇసుక లోడు చేసుకుని తరలిస్తున్నట్టు ఆరోపణలు వచ్చాయి. గత మంగళవారం లంకాలపల్లి వద్ద టాస్క్‌ఫోర్సు దాడులు చేసి మూడు లారీలను పట్టుకున్నారు. ఆ లారీల్లో దాదాపు 72 మెట్రిక్ టన్నుల ఇసుక అదనంగా వచ్చినట్టు గుర్తించి కేసు నమోదు చేసి లారీలు సీజ్ కుక్కునూరు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ క్రమంలో ఎంత ఇసుక అక్రమంగా రవాణా జరిగిందో గుర్తించేందుకు జిల్లా బృందాలు గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించాయి. గతంలో ఉన్న నిల్వలు అమ్మిన ఇసుక, ప్రస్తుతం ఎంత ఇసుక ఉందో గుర్తించడానికి కొలతలు వేశారు.



జేసీ పరిశీలన

జిల్లా జాయింట్ కలెక్టర్ ధాత్రి రెడ్డి గురువారం రాత్రి వింజరం, ఇబ్రహీంపేట ఇసుక స్టాక్ పాయింట్ల వద్దకు వెళ్లి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అప్పటికే విచారణ జరిపిన అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇసుక అక్రమ రవాణా ఎలా జరిగిందనే దానిపై ఆరా తీశారు.



ఇబ్రహీంపేట స్టాక్ పాయింట్‌లో ఇసుక కొలతలు

మాపై దౌర్జన్యం చేసి ఇసుక తీసుకెళ్లారు..

తొండిపాక పంచాయతీ కార్యదర్శి గౌరీప్రియ గురువారం ముగ్గురు టిప్పర్ డ్రైవర్లపై, ఒక జేసీబీ ఆపరేటర్‌పై కుక్కునూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తాము విధులు నిర్వహిస్తుండగా దౌర్జన్యంగా అధిక మొత్తంలో ఇసుక లోడు చేసుకుని వెళ్లారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. దొండిపాక గ్రామ రెవెన్యూ అధికారి గోపాలరావు కూడా కుక్కునూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ప్రభుత్వం నిర్ణయించిన జేసీబీ స్థానంలో మరో భారీ యంత్రాన్ని తీసుకొచ్చి దౌర్జన్యంగా ఇసుకను అధికంగా లోడు చేసుకుని తరలించుకుపోయారని నలుగురిపై ఫిర్యాదు చేశారు. కాగా టిప్పర్ డ్రైవర్లు ముగ్గురు, ఆపరేటర్ తెలంగాణ ప్రాంతానికి చెందిన వారు కావడం విశేషం.



ఇళ్లు కొట్టుకుపోవడంతో గుడారాల్లో ఉంటున్న బాధితులు

కన్నీటి వేదన..

- పెద్దవాగు వరదతో ఊళ్లు విధ్వంసం..
- ఇళ్లు కొట్టుకుపోయి నిలువ నీడ కరువు
- గుడారాల్లో తలదాచుకుంటున్న వైనం
- అధికారులు పట్టించుకోవడం లేదని బాధితుల ఆవేదన

వేలేరుపాడు, జూలై 25 : గత గురువారం పెద్దవాగు ప్రాజెక్టుకు గండి పడడంతో వరద వెల్లువలా ఊళ్లపై పడి విధ్వంసాన్ని సృష్టించింది. ఒక్కసారిగా వరద మృత్యువులా తరుముకుని రావడంతో ఆయా గ్రామస్థులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పరుగులూ తీస్తూ ఎత్తైన ప్రదేశాలకు చేరుకున్నారు. తమ కళ్ళ ముందే ఎంతో కాలంగా కష్టపడి నిర్మించుకున్న ఇళ్లు, సామాన్లు, వరదలో కొట్టుకుపోతుంటే చేసేదేమీలేక అసహాయకులుగా చూస్తూ ఉండిపోయారు. నిలువ నీడ లేక కట్టుబట్టలతో మిగిలారు. మండలంలోని కమ్మరగూడెం, మేడేపల్లి, అల్లూరి నగర్, ఒంటిబండ, కోయమాదారం, ఊటగుంపు, రామవరం, రాళ్లపూడి, సొందె గొల్లగూడెం, వసంతవాడ, పాత పుచ్చిరాళ్ల గ్రామాలు పెద్దవాగు బారిన పడ్డాయి. ఆయా గ్రామస్థులు వరద తగ్గిన తర్వాత గ్రామాల్లోకి వచ్చి చూసుకుంటే తమ ఇళ్ల ఆనవాళ్లు కూడా లేకుండా వరదల్లో కొట్టుకుపోవడంతో గుండెలు బాదుకున్నారు. జిల్లా అధికారులు వరద తగ్గిన అనంతరం గ్రామాల్లో సహాయక చర్యలు ప్రారం భించిన అవిఅరకొరగానే ఉన్నాయన్నది బాధితుల ఆరోపణ. వండుకునేందుకు గిన్నెలు కూడా లేకపోవడంతో అధికారులే భోజన సదుపాయం కల్పించారు. వరద ప్రభావిత గ్రామాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు, మంత్రి పరామర్శలకు వచ్చిన సమయంలో అన్ని విధాలా ఆదుకుంటామని హామీలిచ్చారు. వారం గడుస్తున్నా ఇప్పటి వరకు తమకు భోజనం, తాగునీరు తప్ప మరే సహాయం అందలేదని బాధితులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పెద్దవాగు వరదల కారనంగా పూర్తిగా నష్టపోయిన తమకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని కూలిన ఇళ్ల స్థానంలో పక్కాఇళ్లు నిర్మించి ఇస్తామని చెప్పినప్పటికి ఇప్పటి వరకు అధికారులు ఏ మాత్రం స్పందించడం లేదని అల్లూరి నగర్ గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. వరదల్లో ఇళ్లు కూలిపోవడంతో తాత్కాలికంగా గుడారాలు వేసుకుని వాటిలోనే నివాసం ఉంటున్నామని బాధితులు తెలిపారు. వరదల కారణంగా నష్టపోయిన తమకు న్యాయం చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

సర్వస్వం కోల్పోయాం



వరదకు ఇంట్లోని సామాన్లు మొత్తం తడిచి పోయాయి. గతేడాదే అప్పుచేసి చిన్నపాటి పక్కాఇల్లు నిర్మించుకున్నాం. వరద ధాటికి సగం ఇల్లు కూలి పోయింది. పొలంలో ఇసుక మేటలు వేయడంతో వ్యవసాయం చేసే వీలు లేకుండా పోయింది. నేటి వరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి సహాయం అందలేదు. ప్రభుత్వం ఆదుకోవాలి.

- పూసం సీతమ్మ, అల్లూరి నగర్.

ఇల్లు కొట్టుకుపోయింది.



వరదకు మా పూరిల్లు కొట్టుకుపోయింది. కట్టుకున్న బట్టలు తప్ప మరేమీ మిగలలేదు. ఉండటానికి ఇల్లు లేకపోవడంతో తాత్కాలికంగా ప్రభుత్వం ఇచ్చిన టార్పాలిన్‌తో చిన్న గుడారం వేసుకుని ఉంటున్నాం. అధికారులు బుధవారం వరకు భోజన సదుపాయం కల్పించారు. ప్రస్తుతం అది కూడా నిలిపివేశారు. నష్టపోయిన మాకు ప్రభుత్వమే న్యాయం చేయాలి.

- పూసం నాగేశ్వరరావు, అల్లూరినగర్

ఆంధ్రజ్యోతి ఫోకస్

అడుగుకో గొయ్యి

ఉమ్మడి పశ్చిమలో రహదారులు ఛిద్రం

- గత వైసీపీ పాలనలో రోడ్ల అభివృద్ధికి చర్యలు నిల్
- ప్రయాణికులు, ఆయా ప్రాంతాల ప్రజలు ఆగ్రహం

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని రహదారులు మరింత ఛిద్రంగా మారాయి. అడుగుకో గొయ్యి మాదిరిగా.. గుంతల్లో వర్షపు నీరు నిలిచి వాహనదారులు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. గత వైసీపీ ప్రభుత్వం రహదారుల అభివృద్ధిని పూర్తిగా గాలికి వదిలేసింది. కనీసం మరమ్మతులు కూడా చేయించలేదు. అడపాదడపా మరమ్మతులు చేసినప్పటికి నాసిరకంగానే పనులు చేయడంతో రోడ్లు అధ్వానంగా మారాయి. మరికొన్ని చోట్ల అభివృద్ధి పనులు ప్రారంభించినప్పటికీ కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడంతో మధ్యలోనే నిలిపివేసిన సందర్భాలు ఉన్నాయి. దీనికంతటికి గత వైసీపీ ప్రభుత్వ తీరే కారణమని.. ఈ పాపం వైసీపీదేనని రోడ్ల మరమ్మతుల్లో భాగంగా ఒక్క తట్ట మట్టికూడా పోసిన సందర్భాలు లేవని ప్రయాణికులు, వాహనదారులు, ఆయా గ్రామాల స్థానికులు బాహాటంగానే విమర్శిస్తున్నారు. రహదారుల ఛిద్రం.. ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆంధ్రజ్యోతి ఫోకస్.


ఏలూరు-మాదేపల్లి సమీపంలో రోడ్డుపై భారీ గొయ్యి


భీమవరం నుంచి దెయ్యాలతిప్ప వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డు దుస్థితి


జాలిపూడి వద్ద రహదారి గోతులమయం

ఆ రోడ్లపై నరక ప్రయాణమే..

తాడేపల్లిగూడెం రూరల్ : తాడేపల్లిగూడెం నుంచి తణుకు వెళ్లే రోడ్డు జువ్వలపాలెం వరకు.. ఆ తరువాత ప్రత్తిపాడు నుంచి నవాబుపాలెం వరకు రోడ్డులో వెళ్లాలంటే ఒళ్లు హూనమవుతుంది. మరో వైపు తాడేపల్లిగూడెం నుంచి ఏపీ నిట్ మీదుగా టిడ్కో ఇళ్ల దారిన వెళ్లే రోడ్డు పెద్దపెద్ద గోతులతో భయపెడుతున్నాయి. నవాబుపాలెం నుంచి జగన్నాథపురం మీదుగా వెంకట్రావుపాలెం వెళ్లే రోడ్డు మరింత దారుణంగా ఉంది.


తాడేపల్లిగూడెం నిట్ కళాశాల మీదుగా టిడ్కో ఇళ్లకు వెళ్లే రోడ్డు దుస్థితి

రహదారులు ధ్వంసం..

ఆచంట : ఆచంట నుంచి ములపర్రు వెళ్లే రహదారి ఆచంట కచేరి సెంటర్ నుంచి వేమవరం వెళ్లే రోడ్డు.. ఇటీవల కొత్తగా ఆచంట పోలీసు స్టేషన్ నుంచి మార్కెట్ రోడ్డుకు ఏర్పాటు చేసిన రహదారితోపాటు మరికొన్ని చోట్ల రహదారులు ధ్వంసమయ్యాయి. సంబంధిత శాఖల అధికారులు స్పందించి కనీసం మరమ్మతులు చేయాలని ఆయా స్థానికులు కోరుతున్నారు.


ఆచంట నుంచి ములపర్రు వెళ్లే రోడ్డు

చిత్తడిగా రహదారులు

పెంటపాడు : వర్షాలకు రహదారులు చిత్తడిగా మారాయి. గోతుల్లో వర్షపు నీరు చేరిపోవడంతో ప్రయాణాలు సాగించలేక వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రత్తిపాడు వై.జంక్షన్ నుంచి నవాబ్‌పాలెం వంతెన వరకు ఉన్న రహదారి పూర్తిగా ఛిద్రమైంది. మీనవల్లూరు నుంచి బి.కొండేపాడు, కె.పెంటపాడు నుంచి పడమ రవిప్పర్రు, చింతపల్లి నుంచి కోరుమిల్లి మీదుగా బి.కొండేపాడు, అలంపురం నుంచి ప్రత్తిపాడు తదితర రహదారులన్నీ చిత్తడిగా మారాయి.


పెంటపాడు మండలం మీనవల్లూరు-బీకొండేపాడు రహదారి

సమతానగర్ రోడ్డు పట్టించుకోండి.

ఆకివీడు : నలభై ఏళ్ళ నుంచి సమతానగర్ రోడ్డును పట్టించుకొనే నాథుడు లేరు. స్థానికులు పలుమార్లు పాలకులు, అధికారులు దృష్టికి తీసుకెళ్ళినా ఫలితం కనబడలేదు. ఎన్నికల సమయాల్లో హామీలు తప్ప పనులు చేసిన వారు లేదు. కూటమి ప్రభుత్వంలోనైనా రోడ్ల పనులు చేపడతారని సమతానగర్ వాసులు ఎదురుచూస్తున్నారు.


బురదమయంగా సమతానగర్ రోడ్

ఐదేళ్లుగా మరమ్మతులకు నోచుకోని రోడ్లు

ఇరగవరం : గత వైసీపీ ఐదేళ్ల పాలనలో మండలంలోని రహదారులు రాళ్లు తేలి, గోతులమయంగా మారాయి. అయితంపూడి గ్రామంలో ప్రధాన రహదారి తారు లేచి మట్టిరోడ్డుగా దర్శనమిస్తుంది. రోడ్డు మొత్తం గోతులు, బురదమయం కావడంతో వాహన దారులు ఇబ్బందులు పడుతున్నారు. ఓగిడి గ్రామంలో అయింతపూడి గ్రామానికి కలిపే రహదారి పొడవునా గోతులు నిలిచి చెరువులను తలపిస్తు న్నాయి. గ్రామాల్లో సరైన డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగునీరు రోడ్లపై పారుతోంది. ఇరగవరం, కె. ఇల్లిందలపర్రు, తూర్పువిప్పర్రు, తదితర గ్రామాల్లో రోడ్లు అధ్వానంగా ఉన్నాయి.


అయింతంపూడి ప్రధాన రహదారిలో గోతులు

నిధులు కేటాయించినా.. జరగని పనులు

నరసాపురం రూరల్/ మొగల్తూరు : గత వైసీపీ ప్రభుత్వం రహదారి పనులకు నిధులు కేటాయించినా.. పనులు మాత్రం నాలుగేళ్లుగా ముందుకు సాగలేదు. కొత్త నవరసపురం నుంచి మేడపాడు వరకు సుమారు రూ.20 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఈ పనులకు అప్పటి ఎమ్మెల్యే ప్రసాదరాజు శంకుస్థాపన చేశారు. పనులు మాత్రం ముందుకు సాగలేదు. మొగల్తూరు మండలం మొగల్తూరు-వెంప, కాళీపట్నం పడమరలోని ఆర్అండ్‌బీ రహదారి పనులు గత ప్రభుత్వ హయాంలో ముందుకు సాగలేదు. కోమటితిప్ప-కోత్తోట గ్రామాల మధ్య ఆర్అండ్‌బీ రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేసినా పనులు ప్రారంభానికి నోచుకోలేదు.


గోతులమయంగా నవరసపురం రహదారి

12 కిలోమీటర్ల పొడవునా గోతులే..

భీమవరం రూరల్ : భీమవరం మండలం దెయ్యాలతిప్ప నుంచి భీమవరం వెళ్లే ఆర్అండ్‌బీ రహదారి అధ్వానంగా మారింది. 12 కిలోమీటర్లు పొడవునా గోతులతోను ఒక్కో చోట అడుగు లోతు గోతులతో వాహనదారులకు ప్రమాదకరంగా మారింది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో సుమారు రూ.పది కోట్లతో రహదారి అభివృద్ధి చేశారు. గత వైసీపీ ప్రభుత్వం చిన్న మరమ్మతు చేయకపోవడంతో దారుణంగా మారింది.

బిల్లులు చెల్లించక నిలిచిన రోడ్డు పనులు

యలమంచిలి, జూలై 25: మేడపాడు, ఆర్యపేట, యలమంచిలి, చించినాడ, ఏనుగువానిలంక, నవరసపురం గ్రామాల మధ్య రహదారిలో చాలాచోట్ల గోతులు, పలుచోట్ల రహదారి కుంగిపోవడంతో రాకపోకలకు వాహనదారులు అవస్థలు పడుతున్నారు. చినుకుపడితే బురదమయంగా మారి గుంతల్లో వాహనాలు అదుపుతప్పి పడిపోతున్నారు. ముఖ్యంగా ఏనుగువానిలంక గ్రామ శివారులోనూ, బ్రాంచి కాలువ సమీపంలోనూ, ఘటాల చెరువు ప్రాంతాల్లో రహదారి ఒకవైపు దిగబడిపోయింది. సుమారు రెండున్నరేళ్ల క్రితం వైసీపీ ప్రభుత్వ హయాంలో రూ.4కోట్ల నిధులతో ఈ రోడ్డు విస్తరణ, అభివృద్ధి చేసేందుకు పనులు ప్రారంభించినప్పటికీ, కొంతకాలంపాటు పనులు నత్తనడకన సాగాయి. చేసిన పనులకు వైసీపీ ప్రభుత్వం బిల్లులు చెల్లించలేదని కాంట్రాక్టర్ పనులను నిలిపివేయడంతో ఈ రోడ్డు మరింత అధ్వానంగా మారింది.


యలమంచిలి-చించినాడ రహదారి

గ్రామీణ రహదారులు అధ్వానం

ఏలూరు రూరల్ : ఏలూరు రూరల్ మండలంలో సరైన రహదారి లేని గ్రామాలు అనేకం ఉన్నాయి. కొన్ని గ్రామాలకు సీసీ రోడ్లు వేస్తూ నిధుల కొరత కారణంగా పనులు నిలిచిపోయాయి. మరికొన్ని గ్రామాల్లో రహదారులు వేసేందుకు అనుమతులు వచ్చినా పనిచేసేందుకు కాంట్రాక్టులు ముందుకు రాకపోవడంతో పనులు ప్రారంభం కాలేదు. రూరల్ మండలం కాట్లంపూడి రహదారి పూర్తిగా ఛిద్రమైంది. మాదేపల్లి, జాలిపూడి వెళ్లే ప్రధాన రహదారి భారీ గోతులు పడి దర్శనమిస్తున్నాయి.


కాట్లంపూడిలో..

కొట్టుకుపోయిన రోడ్లు

బుట్టాయగూడెం : ఇటీవల ఏజెన్సీ ప్రాంతంలో కురిసిన భారీవర్షాలకు అటవీ ప్రాంతంలోని కొండరెడ్డి గ్రామాల్లో వేసిన రోడ్లు పూర్తిగా కొట్టుకుపోయాయి. ముంజులూరు నుంచి చింతపల్లి, గెడ్డపల్లి, ఉర్రింక, దార్వాడ, చిలకలూరు తదితర గ్రామాల్లో నిర్మించిన రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. పాడైపోయిన రోడ్లను బాగుచేయాలంటూ ఐటీడీఏ అధికారులను కలిసి రెడ్లు వినతిపత్రం అందించారు.

గుంతలు పూడ్చండి మహాప్రభో!

చింతలపూడి : చింతలపూడి నగర పంచాయతీ, గురుపట్లగూడెం రోడ్లు రేచర్ల, ఎర్రగుంటపల్లి, ఫాతిమాపురం, శివపురం, లింగగూడెం, బుర్లగూడెం గ్రామాల్లోని ఆర్అండ్‌బీ రోడ్లతో పాటు పంచాయతీరాజ్ రోడ్లు దారుణంగా ఉన్నాయి. చింతలపూడి నుంచి సీతానగరం వరకు ఆర్అండ్‌బీ రోడ్డుఅంతా గోతులమయమైంది. రేచర్ల వద్ద మలుపులో భారీ గోతులతో బస్సులు తిరగలేని పరిస్థితి నెలకొంది. కనీసం వీటిని రాళ్లతో పూడ్చి మెరుగుపర్చాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


గురుపట్లగూడెం రోడ్డులో భారీ గుంతలు

అదనపు పొగాకు అమ్మకాలకు కేంద్రం గ్రీన్ సిగ్నల్

- ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ హర్షం

జంగారెడ్డిగూడెం, జూలై 25 : రైతులు అదనంగా పండించిన వర్జీనియా పొగాకును అధీకృత వేలం కేంద్రాల్లో అమ్ముకోవడానికి, వేలం కేంద్రాల ద్వారా వ్యాపారులు కొనుగోలు చేయడానికి కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని కేంద్ర ప్రభుత్వ కార్యదర్శి సునీల్ బర్త్వాల్ ఉత్తర్వులు విడుదల చేశారని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన హర్షం వ్యక్తం చేసి మాట్లాడారు. మిచౌంగ్ తుఫాన్ వల్ల పంట నష్టపోయిన తరువాత ప్రభుత్వం అనుమతి ఇచ్చిన దానికంటే అదనంగా పొగాకు పండించా మని, ఆ పొగాకును అపరాధ రుసుం లేకుండా కొనుగోలు చేయాలని ఈనెల పదో తేదీన దేవరపల్లిలో జరిగిన పొగాకు (టీబీఐ) రైతు అవార్డుల వేడుకల్లో రైతులు తన దృష్టికి తీసుకొచ్చారన్నారు. దీనిపై కేంద్ర మంత్రి పియూష్ గోయల్‌కు వివరించి అనుమతి కోరగా వెంటనే స్పందించి అపరాధ రుసుం లేకుండా అదనపు పొగాకును రైతులు అమ్ముకునేలా జీవో విడుదల చేశారన్నారు. ఒక పొగాకు బ్యారన్ లైసెన్సు కలిగిన ప్రతీ రైతు ఇప్పటివరకు 35 క్వింటాళ్ళ పొగాకు మాత్రమే పండించవలసి ఉండగా ఇక నుంచి 41.25 క్వింటాళ్ళ వరకు పండించుకోవడానికి కేంద్రం అనుమతిచ్చినట్టు తెలిపారు. త్వరలో పామాయిల్ రైతుల సమస్యలను పరిష్కరిస్తానని ఎంపీ పేర్కొన్నారు.


కేంద్ర ప్రభుత్వ కార్యదర్శి సునీల్ బర్త్వాల్‌తో ఎంపీ పుట్టా

27,28 తేదీల్లో రాష్ట్రస్థాయి చెస్ క్రీడాకారుల ఎంపిక

భీమవరం అరన్, జూలై 25: అనసూయ చెస్ అకాడమి ఆధ్వర్యంలో ఆంధ్ర, జిల్లా అసోసియేషన్ సహకారంతో ఈనెల 27, 28 తేదీల్లో రాష్ట్రస్థాయి అండర్-11 ఓపెన్ గరల్స్ చదరంగం పోటీలు-2024 నిర్వహిస్తున్నట్టు జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు మాదాసు కిషోర్ తెలిపారు. భీమవరంలోని ప్యాడీ రైస్ మర్చంట్స్ హాల్లో జరిగే పోటీల్లో గెలుపొందిన వారు అక్టోబరు 3 నుంచి 13 వరకు హైదారాబాదులో జరిగే జాతీయస్థాయి చెస్ చాంపియన్‌షిప్ రాష్ట్రం తరపున ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. వివరాలకు 90632 24466 నంబరులో సంప్రదించాలన్నారు.

28న సబ్ జూనియర్స్ బాస్కెట్‌బాల్ ఎంపిక పోటీలు

ఏలూరు రూరల్, జూలై 25: రాష్ట్ర స్థాయి అంతర్ జిల్లాల సబ్ జూనియర్ మినీ బాస్కెట్‌పోటీలు చిత్తూరు జిల్లాలో ఆగస్టులో జరగనున్నాయి. ఈమేరకు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా బాలబాలికలకు ఈనెల 28న ఏలూరు కస్తూరిబా మున్సిపల్ హైస్కూల్ ప్రాంగణంలో సాయంత్రం మూడు గంటల నుంచి ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్టు ఉమ్మడి జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.కృష్ణారెడ్డి తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు మీసేవలో తీసుకున్న ఒరిజినల్ జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు తీసుకురావాలని సెక్రటరీ శ్రీను, ట్రెజరర్ కె.మురళీకృష్ణ తెలిపారు. మరింత సమాచారానికి 94411 71933 నంబరులో సంప్రదించాలన్నారు.

జాతీయస్థాయి 'ప్రేరణ'కు వట్లూరు గురుకుల విద్యార్థిని

పెదపాడు, జూలై 25 : జాతీయస్థాయి శిక్షణ కార్యక్రమం ప్రేరణకు పెదపాడు మండలం వట్లూరులోని బాలయోగి గురుకుల పాఠశాలలో పదో తరగతి విద్యార్థిని వంపుగాని అనుశ్రీ ఎంపికవ్వడం పట్ల విద్యార్థినికి ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ యాదవ్ ఓ ప్రకటనలో ప్రత్యేక అభినందనలు తెలిపారు. దేశవ్యాప్తంగా పది జిల్లాల నుంచి 20 మంది విద్యార్థులను ఎంపిక చేయగా వారిలో మన రాష్ట్రం నుంచి ఏలూరు జిల్లాకు చెందిన అనుశ్రీ ఎంపిక కావడం విశేషం. యువతలో సాధికారిత కల్పించడం, రూపాంతరమైన, అనుభవ పూర్వక అభ్యాసనే ప్రేరణ కార్యక్రమ ముఖ్య ఉద్దేశం కాగా దీనికి ఎంపికైన విద్యార్థిని అనుశ్రీ దేశ రాజధాని ఢిల్లీలో జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొంటుంది. ప్రేరణ శిక్షణ కార్యక్రమానికి ఎంపికైన బాలికను మండల విద్యాశాఖాధికారులు అభినందించారు.


వి.అనుశ్రీ

క్రైం సమాచారం

చికిత్స పొందుతూ బెంగాలీ కూలీ మృతి

లింగపాలెం, జూలై 25 :వ్యవసాయ పనుల నిమిత్తం పశ్చిమ బెంగాల్ నుంచి వచ్చిన వ్యవసాయ కూలీ బైక్ ఢీ కొని మృతి చెందిన ఘటన లింగపాలెం మండలంలో జరిగింది. ధర్మాజీగూడెం ఎస్ఐ చెన్నారావు తెలిపిన వివరాలివి.. మండలంలోని ఆసన్నగూడెంకు వరినాట్ల నిమిత్తమై బెంగాల్ నుంచి పలువురు కూలీలు వలస వచ్చినట్టు తెలిపారు. ఈ సందర్భంగా బెంగాల్‌కు చెందిన మనోరంజన్ మండల్(56) అనే వ్యక్తి ఈ నెల 22న పనుల అనంతరం కూరగాయలు తీసుకుని వెళుతుండగా వెనుక నుంచి బైక్ ఢీ కొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఏలూరులోని ఆంధ్ర హాస్పిటల్‌కు తీసుకువెళ్లి మెరుగైన చికిత్సకు విజయవాడ తీసుకువెళ్ళగా అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు ఎస్ఐ పి.చెన్నారావు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

లారీ ఢీకొని ఒకరి మృతి.. మరొకరికి గాయాలు

యలమంచిలి, జూలై 25: అడవిపాలెం గ్రామం ప్రధానరహదారిపై గురువారం రాత్రి లారీ ఢీకొనడంతో మోటారు సైకిల్‌పై వెళుతున్న ఒకరు మృతి చెందగా.. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయని ఎస్ఐ కె.శివన్నారాయణ తెలిపారు. మట్లపాలెం గ్రామం కట్టావారిపాలెం ప్రాంతానికి చెందిన కప్పల సునీల్‌బాబు(34), అబ్బిరాజుపాలెం గ్రామానికి చెందిన చిట్టూరి దుర్గాప్రసాద్ మోటార్‌సైకిల్‌పై పాలకొల్లు వెళ్లి పనులు ముగించుకుని గ్రామానికి తిరిగి వెళుతున్నారు. అడవిపాలెం వినాయకుని ఆలయానికి సమీపంలో ప్రధాన రహదారిపై వెనుక నుంచి వస్తున్న లారీ ఢీ కొట్టడంతో కప్పల సునీల్‌బాబు(34) మృతి చెందాడు. చిట్టూరి దుర్గాప్రసాద్‌కు తీవ్ర గాయాలయ్యాయి. మృతుడు పాలకొల్లులోని ప్రైవేటు ఫైనాన్స్ సంస్థలో ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. వీరిని పాలకొల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దీనిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.


సునీల్‌బాబు (ఫైల్)

మద్యం దుకాణం దగ్ధంపై ప్రత్యేక దర్యాప్తు

భీమవరం క్రైం, జూలై 25 :భీమవరం పట్టణ పరిధిలోని తాడేరు రోడ్డులో ఉన్న ప్రభుత్వ మద్యం దుకాణం బుధవారం రాత్రి దగ్ధమైంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది అక్కడకు వెళ్లి మంటలను అదుపు చేశారు. మద్యం సీసాలు పూర్తిగా దగ్ధమయ్యాయి. లాకర్‌లో ఉంచిన లక్షా 90 వేల రూపాయల నగదు మాత్రం బయటకు తీశారు. ఈ ప్రమాదం షార్ట్ సర్క్యూట్ వల్ల జరిగిందా, కావాలనే ఎవరైనా దగ్ధం చేశారా ? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. విజయవాడ నుంచి క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్‌లు వచ్చి పరిశీలన చేశాయి. ఇంకా ఆస్తి నష్టం అంచనా వేయాల్సి ఉందని భీమవరం ఎక్సైజ్ ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు.


దగ్ధమౌతున్న ప్రభుత్వ మద్యం దుకాణం

ఆసుపత్రికి వెళితే.. ఇంట్లో చోరీ

- నాలుగు కాసుల బంగారం అపహరణ

ఆకివీడు, జూలై 25 : ఇంటికి తాళం వేసి భర్తను భీమవరం ఆసుపత్రికి తీసుకెళితే ఇంట్లో దొంగలు పడి బంగారం దోచుకెళ్లిన ఘటన దుంపగడపలో జరిగింది. ఎస్ఐ బత్తిన నాగబాబు తెలిపిన వివరాలివి.. గ్రామానికి చెందిన పిన్నమరాజు స్వప్న తన భర్త సూరపరాజును ఈ నెల 22న భీమవరం ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తీసుకెళ్ళింది. గురువారం ఉదయం బంధువులు స్వప్నకు ఫోన్ చేసి మీ ఇంటి తలుపులు తీసి ఉన్నాయని తెలపడంతో సత్వరమే వచ్చి చూసేసరికి తాళం పగుల కొట్టి ఉంది. ఇంటిలోకి వెళ్లి పరిశీలించగా బీరువా తెరిచి బట్టలు చిందరవందరచేసి నాలుగు కాసుల బంగారు ఆభరణాలు అపహరణకు గురైనట్టు గుర్తించింది. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ బత్తిన నాగబాబు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.



నకిలీ బంగారంతో రూ.లక్షల టోకరా !

- తనిఖీల్లో బయటపడ్డ వైనం..
- కేసు పెట్టేందుకు నరసాపురంలో వ్యాపారుల తర్జనభర్జన



నరసాపురం, జూలై 25: నకిలీ బంగారం తాకట్టు పెట్టి వ్యాపారులను బురిడీ కొట్టించిన ఘటన నరసాపురంలో వెలుగుచూసింది. నమ్మకంగా బంగారం తాకట్టు పెడుతూ వ్యాపారుడిని నమ్మించి చివరికి రూ.30 లక్షలపైనే టోకరా వేశారు. వడ్డీ పెరిగిపోవడం, విడిపించుకునేందుకు రాకపోవడంతో అనుమానం వచ్చి వస్తువుల్ని పరీక్ష చేయగా.. అసలు విషయం బయటపడింది. వ్యాపారులు కేసు పెట్టేందుకు సిద్ధం అవుతున్నారు. జిల్లాలో నరసాపురం తాకట్టు వ్యాపారులకు పెట్టింది పేరు, నిత్యం కోట్ల రూపాయల లావాదేవీలు జరుగుతుంటాయి. నమ్మకంగా ఉన్న వారికి అవసరాన్ని బట్టి అప్పు ఇస్తారు, బ్యాంకు కంటే గ్రాముకు ఎక్కువ మొత్తంలో అప్పు ఇస్తుండడంతో చాలామంది వ్యాపారుల వద్దే వస్తువుల్ని తాకట్టు పెడుతుంటారు. ఇదే నమ్మకాన్ని ఒక కేటుగాడు తరచూ వస్తువుల్ని తాకట్టు పెడుతూ మళ్లీ విడిచిపించుకుంటూ ఉండేవాడు. చాలాఏళ్లుగా సాగుతుండడంతో అతడిపై నమ్మకం ఏర్పడింది. ఒకటి రెండు సార్లు కేటుగాడు తాకట్టు పెట్టిన వస్తువుల్ని గీటు వేయకుండా అప్పు ఇస్తుండడంతో అతడి ఆలోచన మారింది. నకిలీ ఆభరణాలు పెట్టి అప్పు తీసుకోవాలని ప్రణాళిక చేసి.. దానికి అనుగుణంగా ఆభరణాలను పెట్టి లక్షల్లో అప్పు తీసుకున్నాడు. సకాలంలో కట్టకపోవడంతో వ్యాపారికి అనుమానం వచ్చి వాటిని చెక్ చేస్తే నకిలీ ఆభరణాలు అని తేలింది. దీంతో వ్యాపార సంఘాన్ని ఆశ్రయించాడు. కేసుపై వ్యాపారులు తర్జనభర్జన పడుతున్నారు. అయితే ఈ మోసంపై వ్యాపారులెవ్వరూ నోరు మెదపడం లేదు.

పెట్రోల్ పోసి నిప్పంటించిన విద్యార్థిపై కేసు

- బాధిత బాలుడి చికిత్స కోసం విజయవాడ తరలింపు

ఏలూరు క్రైం, జూలై 25 : ఏలూరు విద్యానగర్‌లో ఉన్న బాయిస్ కాన్వెంట్‌లో బుధవారం తోటి విద్యార్థిపై పెట్రోల్ పోసి నిప్పంటించిన ఉండి మండలం చెరుకువాడ విద్యార్థిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని త్రీ టౌన్ పోలీసులు తెలిపారు. ప్రస్తుతం ఆ బాలుడిని ఇంతవరకూ అరెస్టు చేయలేదు. రెండు రోజుల్లో అరెస్టు చేయనున్నట్టు ప్రాథమిక సమాచారం. అరెస్టు చేసి జువైనల్ కోర్టుకు హాజరుపర్చనున్నట్టు తెలిసింది. స్కూలు సమీపంలో ఉన్న గాయపడిన బాలుడిని మిషనరీ ఆసుపత్రిలో ఉంచి వైద్యం అందిస్తున్నారు. అక్కడ నుంచి ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా.. మెరుగైన వైద్యం కోసం విజయవాడ ఆసుపత్రికి వైద్యులు రిఫర్ చేశారు. తొలుత బాధిత బాలుడిని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ గురువారం ఉదయం పరామర్శించి ఆ కుటుంబానికి ధైర్యం కల్పించారు.

ఊరెళ్లి వచ్చేసరికి ఇంటిని దోచేశారు

- ఆరు కాసుల బంగారం, రూ.50 వేల నగదు అపహరణ

జంగారెడ్డిగూడెం, జూలై 25 : తాళం వేసి ఉన్న ఇంట్లో దుండగులు ప్రవేశించి నగదు, బంగారం దోచుకెళ్లిన ఘటన జంగారెడ్డిగూడెం పట్టణంలోని మార్కండేయపురంలో గురువారం జరిగింది. ఎస్ఐ జ్యోతిబసు తెలిపిన వివరాలివి.. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో నర్సుగా చల్లగాలి దుర్గాభవాని పనిచేస్తున్నారు. మార్కండేయపురంలో ఆమె ఇంటికి మరమ్మతులు చేయించే నిమిత్తం కొద్దిరోజుల క్రితం పట్టణానికి వచ్చారు. ఈనెల 22న బుట్టాయగూడెం మండలంలోని దొరమామిడిలో తన తల్లి ఇంటికి వెళ్లి తిరిగి 24వ తేదీ సాయంత్రం ఇంటికి రాగా.. ఇంటి తాళం పగలగొట్టి ఉండడం చూసి లోపలికి వెళ్లగా బీరువాలో ఉన్న ఆరు కాసుల బంగారు ఆభరణాలు, రెండు జతల వెండి పట్టీలు, రూ.50 వేల నగదు అపహరణకు గురైనట్టు గుర్తించారు. ఈ మేరకు బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

అసెంబ్లీ పాయింట్..

కారుమూరిపై ఏసీబీ విచారణ జరిపించాలి



తణుకులో జరిగిన టీడీఆర్ కుంభకోణంలో ప్రధాన సూత్రధారి మాజీ మంత్రి కారుమూరిపై ఏసీబీ విచారణ వేసి నిజాలు వెలికి తీయాలి. రాష్ట్రంలో పట్టణాభివృద్ధి కోసం ఒక మంచి ఉద్దేశంతో టీడీఆర్ బాండ్లను చంద్రబాబు ప్రవేశపెట్టారు. 2019-24వరకు వైసీపీ పాలనలో రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున 3,300 టీడీఆర్ బాండ్ల మంజూరు వెనుక ఆలోచన చూస్తే విశాఖ నుంచి చిత్తూరు వరకు కుంభకోణం జరిగింది. వైసీపీ పాలనలో కొత్తగా దోపిడీలు ఎలా చేయాలి ? అరవై రోజుల్లో అక్రమార్జన ఎలా? దొరక్కుండా స్కామ్‌లు ఎలా చేయాలో పుస్తకాలు ప్రచురించవచ్చు. తణుకులోనే 61 టీడీఆర్ బాండ్లు మంజూరు చేసి 1,48,439 స్క్వేర్ మీటర్లకు గాను 36 ఎకరాలు సేకరించారని, దానికి సంబంధించి 5,93,759 గజాల బాండ్లు ఇచ్చి 146 ఎకరాలు ఈక్వలెంట్‌గా ఇచ్చారని దీనివిలువ వేల కోట్లలో ఉంటుంది. 2014-19 వరకు తణుకులో ఆరువేల గజాలకు మాత్రమే టీడీఆర్ బాండ్లు ఇస్తే, వైసీపీ పాలనలో 1,48,439 గజాలకు బాండ్లు ఇచ్చారు. అందులో 1:2 శాతం ఇవ్వాల్సిన చోట 1:4 శాతం వ్యాల్యూ ఇచ్చారని, డోర్ నెంబర్లు మార్చి అగ్రిమెంట్లు మీద ఉన్న వాటికి టీడీఆర్ బాండ్లు ఇచ్చి రకరకాలుగా దోపిడీ చేశారు.

- ఆరిమిల్లి రాధాకృష్ణ, ఎమ్మెల్యే, తణుకు


శ్రీవారి ఆలయ హుండీల సొమ్ము లెక్కిస్తున్న సిబ్బంది

శ్రీవారి హుండీల ఆదాయం రూ.2.41 కోట్లు

ద్వారకాతిరుమల, జూలై 25: ద్వారకాతిరుమలేశుని హుండీల లెక్కింపు ఆలయ ప్రాంగణంలోని ప్రమోద కల్యాణమండప ఆవరణలో గురువారం నిర్వహించారు. అత్యంత భద్రతా ఏర్పాట్ల నడుమ జరిగిన ఈ హుండీల లెక్కింపు ద్వారా గడిచిన 28 రోజుల కాలానికి గాను స్వామికి రూ.2,41,72,018 భారీ ఆదాయం సమకూరింది. నగదుతో పాటు భక్తులు సమర్పించిన కానుకల రూపేణా 401 గ్రాముల బంగారం, 6.222 కేజీల వెండి లభించినట్లు ఈవో వి.త్రినాథరావు తెలిపారు. రద్దయిన పాతనోట్లు రూ.500 (12), 1000(1), 2000(82)తో పాటుగా పలుదేశాల కరెన్సీ సైతం అధికంగా లభించింది.

11 నెలలుగా జీతాల్లేవ్..

- ఏలూరు ప్రభుత్వ మెడికల్ కాలేజీ పారిశుధ్య కార్మికులు, సెక్యూరిటీ సిబ్బంది ఆందోళన

ఏలూరు క్రైం, జూలై 25 :ఏలూరు ప్రభుత్వ మెడికల్ కాలేజీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు, సెక్యూరిటీ సిబ్బందికి 11 నెలలుగా జీతాలు లేకపోవడంతో ఆందోళన చేపట్టారు. గత ప్రభుత్వం హయాం నుంచి 11 నెలలుగా జీతాలు ఇవ్వకపోవడంతో ప్రతినెలా ఆ సొమ్ముల కోసం ఎదురు చూస్తూనే ఉన్నారు. మొత్తం 35 మంది సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. జీతాలు రాకపోవడంతో ఏపీ మెడికల్ ఎంప్లాయీస్ కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘ జిల్లా కార్యదర్శి వి.దత్తాత్రేయ (దత్తు) నాయకులు పి.విజయ, వినోద్, ప్రభావతుల ఆధ్వర్యంలో గురువారం ఉదయం ఏలూరు ప్రభుత్వ మెడికల్ కాలేజీ వద్ద విధులను బహిష్కరించి ఆందోళన చేపట్టారు. జీతాలు చెల్లించకపోతే తామంతా విధులను బహిష్కరించి నిరవధిక సమ్మెలోకి వెళ్తామని ప్రకటించారు. మరోవైపు ఈ సమస్యను ఎమ్మెల్యే బడేటి చంటి దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రయత్నించగా ఆయన అసెంబ్లీ సమావేశాల్లో ఉన్నారని ఈ సమస్యను ఎమ్మెల్యే పరిష్కరిస్తారని, ఎలాంటి ఆందోళనలు చేయవద్దని యథావిధిగా విధులను కొనసాగించాలని ఎమ్మెల్యే కార్యాలయం నుంచి సమాచారం రావడంతో ఆందోళన విరమించారు.

కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి అన్యాయం : వామపక్షాల నిరసన



ధర్నా చేస్తున్న సీపీఐ, సీపీఎం నాయకులు

ఏలూరు కార్పొరేషన్, జూలై 25: కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం జరిగిందని, న్యాయం చేయాలని కోరుతూ సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో పాత బస్టాండ్ సెంటర్‌లో గురువారం ధర్నా నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ రైతులకు, రైతు కూలీలకు, ఉపాధి కూలీలకు బడ్జెట్‌లో ఎటువంటి కేటాయింపులు లేవన్నారు. మహిళా సంఘాలకు ప్రోత్సాహకాలు ప్రకటించలేదన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు రాయితీలు ప్రకటించాలని, ప్రత్యేక హోదా కూడా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ధర్నాతో ఎక్కడి వాహనాలు అక్కడే స్తంభించాయి. కార్యక్రమంలో వామపక్షాల నాయకులు డేగా ప్రభాకర్, కిషోర్, సత్యనారాయణ, హేమసుందర్, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా కొద్దిసేపు నినాదాలు చేశారు.

డిగ్రీ కళాశాల సమస్యలు పరిష్కరించాలి


ధర్నా చేస్తున్న పీడీఎస్‌వో నాయకులు, విద్యార్థులు

ఏలూరు రూరల్, జూలై 25: డిగ్రీకళాశాల సమస్యలు పరిష్కరించాలని పీడీఎస్‌వో ఆధ్వర్యంలో జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం కోటదిబ్బ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద ధర్నా నిర్వహించారు. జిల్లా కార్యదర్శి ఎస్.మోహన్ మాట్లాడుతూ ఎన్నో ఏళ్ళుగా ఏలూరు కోటదిబ్బలో గల ప్రభుత్వ డిగ్రీకళాశాలకు శాశ్వత భవనాలు, సరిపడా తరగతి గదులు లేక చెట్ల కింద తరగతులు నిర్వహిస్తున్నారన్నారు. డిగ్రీలో ప్రవేశపెట్టిన నాలుగేళ్ల డిగ్రీ పద్ధతిని మల్టీ ఎంట్రన్స్, మల్టీ ఎగ్జిట్ విధానాన్ని రద్దుచేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు రాజా, మధు, ప్రశాంత్, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

అర్హులైన కౌలు రైతులకు బ్యాంకు రుణాలు


కౌలు రైతుల వివరాలు ఇస్తున్న హబీబ్ బాషా

పెదవేగి, జూలై 25: అర్హత కలిగిన కౌలు రైతులకు బ్యాంకు రుణాలు అందించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని వ్యవసాయశాఖ జిల్లా అధికారి ఎస్కే.హబీబ్ బాషా చెప్పారు. కొప్పాక చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు మేనేజర్‌కు ఆ ప్రాంత కౌలు రైతుల వివరాలను గురువారం అందజేశారు. కౌలురైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని పంటల సాగుకు అవసరమైన పెట్టుబడికోసం రుణాలు అందించాలని కోరారు. రుణాలను సక్రమంగా వినియోగించుకోవాలని ఆయన రైతులకు సూచించారు. ఏడీఏ సుబ్బారావు, ఏవో ఎం.ప్రియాంక, రైతులు పాల్గొన్నారు.

చేనేత కళాకారులను ఆదరించాలి


చేనేత వస్త్ర ప్రదర్శన ప్రారంభిస్తున్న డీఎస్పీ

ఏలూరు కార్పొరేషన్, జూలై 25: చేనేత కళాకారులు నైపుణ్యంతో తయారుచేసిన దుస్తులు, వస్త్రాలను కొనుగోలు చేసి వారిని ప్రోత్సహించాలని డీఎస్పీ ఈ.శ్రీనివాసులు సూచించారు. టీటీడీ కళ్యాణ మండపం వద్ద ఉషోదయ హ్యాండ్‌లూమ్స్ అండ్ హ్యాండీ క్రాఫ్ట్ సంస్థ ఏర్పాటు చేసిన చేనేత వస్త్రాలు, హస్తకళల ప్రదర్శనను డీఎస్పీ గురువారం ప్రారంభించారు. వివిధ రాష్ట్రాల్లో తయారైన అన్ని రకాల హస్తకళలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ ప్రదర్శనను తిలకిస్తే అన్ని రాష్ట్రాలు తిరిగిన అనుభూతి కలుగుతుందని తెలిపారు. ఉషోదయ అధినేత శనిగరం కిషోర్ తదితర సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

పాము కాటు బాధితులకు చికిత్స


సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న బాధితులు

పోలవరం, జూలై 25: మండలంలో గత మూడు రోజులలో ఆరు పాముకాటు కేసులు నమోదైనట్లు వైద్యాధికారి కృష్ణంరాజు గురువారం తెలిపారు. ఎల్ఎన్‌డీపేట గ్రామానికి చెందిన ఎస్.అమ్మిరాజు, గూటాలలో తోట కృష్ణ, పాతపట్టిసీమలో జి రాజబాబు, కృష్ణారావుపేటలో పొట్నూరి నాగేశ్వరరావు, రామయ్యపేటలో మేడూరి లక్ష్మణరావు, కొత్తపట్టిసీమలో సిద్దంశెట్టి సత్యనారాయణ పొడ పాముకాటుకు గురయ్యారు. వర్షాల సీజన్‌లో ప్రజలు, రైతులు, కూలీలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పాముకాటు మందులు అందుబాటులో ఉన్నాయని, వెంటనే ఆస్పత్రిలో చేరి వైద్యం చేయించుకోవాలని, నాటు మందులు వద్దని హితవు పలికారు.

మంత్రి సత్యకుమార్‌ను కలిసిన ఎమ్మెల్యే ధర్మరాజు


సమస్యలను విన్నవిస్తున్న ఎమ్మెల్యే ధర్మరాజు

ఉంగుటూరు, జూలై 25: నియోజకవర్గంలోని పలు పీహెచ్‌సీల పునర్నిర్మాణం, అభివృద్ధి కోరుతూ ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను కలసి గురువారం వినతులు అందించారు. నిడమర్రు మండలం పెదనిండ్రకొలను పీహెచ్‌సీని సీహెచ్‌సీ స్థాయి పెంచాలని. గణపవరం పీహెచ్‌సీ స్థాయి పెంచడంతో పాటు 50 పడకల ఆసుపత్రిగా మార్చాలని కోరారు. భీమడోలు సీహెచ్‌సీలో సౌకర్యాలు కల్పించాలని కోరారు. మంత్రి సత్యకుమార్ సానుకూలంగా స్పందించారని ఆయన విలేకరులకు వివరించారు.

తక్షణమే ఉపాధ్యాయులను నియమించండి

ఏలూరు క్రైం, జూలై 25 : శనివారపుపేట ప్రభుత్వ బాలుర వసతి గృహంలో విద్యా బోధనకు అవసరమైన ఉపాధ్యాయులను తక్షణం నియమించాలని న్యాయ సేవాధికార కార్యదర్శి కె.రత్న ప్రసాద్ ఆదేశాలు జారీ చేశారు. వసతిగృహాన్ని గురువారం సాయంత్రం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. బాలురకు అందుతున్న సౌకర్యాలు, వసతులపై ఆరా తీశారు. ఆహార పదార్థాలను స్వయంగా రుచి చూశారు. విద్యా బోధనకు ఉపాధ్యాయులు లేరని విద్యార్థులు చెప్పడంతో అధికారులను ప్రశ్నించారు. విద్యా సంవత్సరం వృధా కాకుండా తక్షణమే ఉపాధ్యాయులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. హోం సూపరింటెండెంట్ శ్రీవల్లి పాల్గొన్నారు.

ఏలూరు బార్ ఎన్నికల్లో నామినేషన్ల స్వీకరణ

ఏలూరు క్రైం, జూలై 25: ఏలూరు బార్ అసోసియేషన్ ఎన్నికలకు గురువారం నామినేషన్ల స్వీకరించారు. అధ్యక్ష పదవికి జిల్లా పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోనే సీతా రామారావు (సీతారామ్) నామినేషన్ దాఖలు చేయగా ఉపాధ్యక్ష పదవికి సీబీడీ స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ మాండ్రు రాజేంద్ర నామినేషన్లు దాఖలు చేశారు. ఒక్కొక్క నామినేషన్ దాఖలు కావడంతో అధ్యక్షుడిగా కోనే సీతారామ్, ఉపాధ్యక్షుడిగా మాండ్రు రాజేంద్ర, ప్రధాన కార్యదర్శిగా చింతమనేని రమేష్, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీగా తిగిరిపల్లి సుబ్బారావు, ట్రెజరర్‌గా బండెల నానాజీ, లైబ్రరీ సెక్రటరీగా ఎంజీవీఎస్ ఫణికుమార్, లేడీ రిప్రజెంటీవ్‌గా పుట్టా కనకదుర్గా భవానీ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లే. ఎన్నికల అధికారి శుక్రవారం ప్రకటించనున్నారు. జాయింట్ సెక్రటరీకి గెల్లా శ్రీనివాసరావు, నోము రాముడు పోటీలో ఉన్నారు. వచ్చే నెల 2న ఎన్నికలు నిర్వహించనున్నారు. ఎన్నికల ప్రధాన అధికారి ఎంవి నారాయణరాజు, సుధీర్‌మాస్టారు, బార్ అధ్యక్షుడు అబ్బినేని విజయ్‌కుమార్ పలువురు పాల్గొన్నారు.

వైసీపీకి మాజీ కార్పొరేటర్ రాజీనామా

ఏలూరు రూరల్, జూలై 25: ఏలూరులో వైసీపీకి రాజీనామాలు కొనసాగుతున్నాయి. మాజీ కార్పొరేటర్, 36వ డివిజన్ ఇన్‌చార్జి మజ్జి కాంతారావు వైసీపీకి గురువారం రాజీనామా చేశారు. తన వ్యక్తిగత, ఆరోగ్య కారణాల కారణంగా పార్టీకి ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

వసతి గృహం కూలిపోయి పదేళ్లు..!

» హైస్కూలులో తలదాచుకుంటున్న విద్యార్థులు
» వార్డెన్ ఖర్చుతో మరుగుదొడ్లకు మరమ్మతులు
» గుండుగొలనులో బాలికల వసతిగృహం దుస్థితి


పదేళ్ల క్రితమే కూలిన గుండుగొలను బాలికల వసతి గృహం


హైస్కూల్ తరగతి గదిలో నిద్రిస్తున్న విద్యార్థినులు

పేద విద్యార్థులకు ఉచిత వసతి సౌకర్యం కల్పించి, వారు విద్యావంతులు కావడానికి ఉద్దేశించిన వసతిగృహాలు వారి పాలిట శాపంగా మారాయి. శిథిలమైన, కూలిపోయిన వసతిగృహాల్లో విద్యార్థులు బిక్కు బిక్కుమంటూ గడుపుతున్నారు. అదీ కుదరక రాత్రి వేళ హైస్కూలు గదుల్లో తలదాచుకుని, పగలు కాలకృత్యాలు, స్నానాలకు శిథిలమైన హాస్టల్ మరుగుదొడ్లు వినియోగిస్తున్నారు. గుండుగొలనులో బాలికల సాంఘిక సంక్షేమ వసతిగృహం పదేళ్ల క్రితం కూలిపోయింది. సుమారు వంద మంది విద్యార్థినులకు తాత్కాలిక ఏర్పాట్లతో నెట్టుకొస్తున్నారు. పక్కనే జడ్పీ ఉన్నత పాఠశాలలో బాలికలకు రెండు గదులు కేటాయించారు. అక్కడే భోజనం, అక్కడే పడక. వంద మందికి మరుగుదొడ్డి సదుపాయం ఎలా? వసతి గృహం మరుగుదొడ్లను స్నానాల గదులను వినియోగిస్తూ రాత్రి సమయంలో నిద్రించేందుకు హైస్కూలుకు వెళతారు. మరుగుదొడ్లు కూడా వినియోగానికి అనువుగా లేకపోవడంతో వార్డెన్ కనకదుర్గ తన సొంత ఖర్చులతో మరమ్మతులు చేయించి విద్యార్థినుల అవసరాలు తీరుస్తున్నారు.

భీమడోలులోని బాలికల వసతిగృహం ఆనంద నిలయం శ్లాబ్ కూడా శిథిలావస్థకు చేరింది. ఇక్కడా సుమారు వంద మంది విద్యార్థినులు ఉన్నారు. వర్షం పడితే శ్లాబ్ నుంచీ నీరు కారుతుంది. మరుగుదొడ్లు, నీటి సౌకర్యం లేదని విద్యార్థులు వాపోతున్నారు. పంచాయతీ నీటిని వినియోగిస్తున్నారు. ఇదే గ్రామంలో బాలుర వసతి గృహంలో సైతం 100 మంది విద్యార్థులున్నారు. ఈ వసతి గృహం భవనం కూడా మరమతులు చేయాల్సి ఉంది. డ్రెయినేజీ, సెప్టిక్ ట్యాంక్ వంటి సౌకర్యాలు లేక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

- భీమడోలు


పీహెచ్‌సీలో విద్యార్థి ఆరోగ్యంపై మలేరియా అధికారి ఆరా, ఏలూరులో ఆయిల్ బాల్స్ వేస్తున్న సిబ్బంది, పోలవరంలో అధికారుల పర్యవేక్షణ

మలేరియా జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి

బుట్టాయగూడెం, జులై 25: మలేరియా జ్వరాలపై ప్రతిఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి పీఎస్ఎస్.ప్రసాద్ తెలిపారు. పులిరామూడుగూడెం పీహెచ్‌సీని గురువారం ఆయన సందర్శించి మలేరియా నిర్మూలనకు తీసుకుంటున్నట్లు చర్యలను పర్యవేక్షించారు. పీఆర్ గూడెం వైద్యాధికారి కె.భాగ్యశ్రీకి జ్వరాలపై తీసుకోవలసిన చర్యలపై సూచనలు ఇచ్చారు. వైరల్ ఫీవర్‌తో పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న ఉప్పరిల్లకు చెందిన వేట్ల మహేశ్వరరెడ్డి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. మలేరియా, సీజనల్ జ్వరాలు, వ్యాధుల ప్రబలకుండా వైద్యాధికారులు, సిబ్బంది తక్షణ చర్యలు చేపట్టాలని తెలిపారు. దోమల మందును అందరూ ఇంటిలోపల పిచికారి చేయించుకోవాలని సూచించారు. జ్వరానికి డాక్టర్లు సూచనల మేరకు మందులు వాడాలని తెలియజేశారు. కాచిచల్లార్చిన నీటినే తాగాలన్నారు. సబ్ యూనిట్ ఆఫీసర్ వి.పెద్దిరాజు, పీహెచ్ఎన్ నాగపొన్నారి సిబ్బంది పాల్గొన్నారు.

ఏజన్సీ గ్రామాల్లో మలాథియాన్ పిచికారీ

పోలవరం: ఎల్ఎన్‌డీ పేట పీహెచ్‌సీ పరిధిలో రెడ్డి కుంకాల, పాత కుంకాల గ్రామాల్లో రెండో విడత మలాథియాన్ పిచికారీ పనులు మలేరియా సబ్ యూనిట్ అధికారి బొంగు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. జిల్లా మలేరియా అధికారి ప్రసాద్, డాక్టర్ నిఖిల్ పర్యవేక్షించారు. ప్రసాద్ మాట్లాడుతూ వర్షాల సీజన్‌లో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఏఎంవో శ్రీను, రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు

ఏలూరు టూటౌన్: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఎంహెచ్‌వో డాక్టర్ మాలతి తెలిపారు. దోమల నివారణలో భాగంగా గురువారం 28వ డివిజన్ ద్వారకానగర్, బీడీ.కాలనీ, వాణినగర్ ప్రాంతాల్లో స్ప్రేయింగ్, మురుగు కాల్వ కల్వర్టుల కింద ఫాగింగ్, నిల్వ ఉన్న నీటిలో ఆయిల్ బాల్స్ వేసినట్లు ఆమె తెలిపారు. తంగిరాల సురేష్, వేణుగోపాల స్వామి, దుర్గారావు, సోమేశ్వరరావు, ఆశా కార్యకర్తలు, పాల్గొన్నారు.

నగరంలో ప్రజారోగ్యంపై సూచనలిస్తూ ప్రచార రథంతో అవగాహన కల్పిస్తున్నట్లు ఎమ్మెల్యే బడేటి చంటి తెలిపారు. మన ఆరోగ్యం మన చేతుల్లోనే అంటూ 50వ డివిజన్స్‌లో ప్రచార రథం విస్తృత ప్రచారం చేస్తుందన్నారు. పరిశుభ్రత పాటిద్దాం ఆరోగ్యంగా ఉందామనే నినాదంతో ముందుకు వెళ్లాలన్నారు. పరిసరాలను ప్రతీ రోజు పరిశుభ్రం చేసుకోవాలన్నారు. దోమ కాటుకు గురికాకుండా దోమ తెరలుకట్టుకోవాలన్నారు. చిన్నపిల్లలు, బాలింతలు, వృద్ధులు, మహిళలు మరింత జాగ్రత్త వహించాలన్నారు.

మోదీ చిత్రపటానికి పాలాభిషేకం

పోలవరం, జూలై 25: కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి కేటాయింపులపై కూటమి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఏటిగట్టు సెంటర్‌లో మోదీ చిత్రపటానికి గురువారం పాలాభిషేకం చేశారు. బీజేపీ మండల కన్వీనర్ కామిశెట్టి నాగరాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కరిబండి నాగరాజు, బొరగం వెంకటలక్ష్మి, గ్రంధి బాలకృష్ణ, కొణతాల ప్రసాద్, గునపర్తి చిన్ని, తెలగంశెట్టి రాంప్రసాద్, కుంచే దొరబాబు, నునకాని రాంబాబు, పట్టిసీమ సర్పంచ్ సబ్బారపు శ్రీరామ్మూర్తి, మంగిన కొండ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ మహేశ్‌కు టీడీపీ నేతల కృతజ్ఞతలు

జంగారెడ్డిగూడెం, జూలై 25: వర్జీనియా పొగాకు రైతులు అదనంగా పండించిన పొగాకుపై కేంద్ర ప్రభుత్వ సెస్ లేకుండా కృషి చేసిన ఎంపీ పుట్టా మహేష్ కుమార్‌కు టీడీపీ నేతలు కృతజ్ఞతలు తెలిపారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు రావూరి కృష్ణ మాట్లాడుతూ పొగాకు రైతుల సమస్యలపై స్పందించిన ఎంపీ అతి త్వరగా సమస్యను పరిష్కరించారన్నారు. తూటిగుంట రాము, అల్లూరి రామకృష్ణ, మానికల నాగేశ్వరరావు ఉన్నారు.

● కొయ్యలగూడెం: బయ్యన్నగూడెంలో ఎంపీ పుట్టా మహేష్ చిత్రపటానికి పొగాకు రైతులు పాలాభిషేకం చేశారు. రామారావు, నరేష్, సత్యనారాయణ, తదితరులు ఉన్నారు.

మా భూములు కాపాడండి.. గిరిజనుల గోడు

చింతలపూడి, జూలై 25: లింగగూడెం పంచాయతీ పరిధిలో గయ్యాళి భూమి తాము సాగుచేసుకుంటున్నామని నాలుగు గ్రామాల గిరిజన నాయకపోడులు తెలిపారు. 40 ఏళ్లుగా సాగుచేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని, ఇప్పుడు భూస్వాములు, కొందరు పెత్తందారులు అమాయక గిరిజనులను అడ్డంపెట్టు కుని కుట్రలు చేస్తున్నారన్నారు. కలెక్టర్, తహసీల్దార్ ఆదేశాలతో లింగ గూడెంలో వీఆర్వో గురువారం విచారణ జరిపారు. లింగగూడెం, గురుపట్లగూడెం, మేడియల్లప్పగూడెం గ్రామాల నాయకపోడులు పెత్తందారుల కుట్రలను, తాము సాగుచేసుకుంటున్న తీరు, పోరాటాల గురించి వీఆర్వోకు వివరించారని రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి భాస్కర్ తెలిపారు. భూముల్లో సాగు హక్కులు, పట్టాలు ఇవ్వాలని కోరారన్నారు.

ఉపాధ్యాయులపై కేసుల ఎత్తివేత నిర్ణయంపై హర్షం

ఏలూరు రూరల్, జూలై 25: ఉద్యోగ, ఉపాధ్యాయులపై కేసులు ఎత్తివేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించడంపై ఉద్యోగ సంఘ నేతలు హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, విద్యాశాఖా మంత్రి నారా లోకేశ్‌కు ఏపీజేఏసీ అసిస్టెంట్ సెక్రటరి జనరల్ ఆర్.ఎస్ హరినాథ్ కృతజ్ఞతలు తెలిపారు. ఐదేళ్లలో ఉద్యోగ, ఉపాధ్యాయులపై పెట్టిన కేసులను సమీక్షించి ఆ కేసులు ఎత్తివేస్తామని అసెంబ్లీ సాక్షిగా చెప్పడంపై ఊరటనిచ్చిందన్నారు.

మద్ది ఆంజనేయుడికి ప్రత్యేక పూజలు


కల్యాణంలో ఈవో కొండలరావు, భక్తులు

జంగారెడ్డిగూడెం, జూలై 25: మద్ది ఆంజనేయస్వామి ఆలయంలో స్వామి వారి జన్మ నక్షత్రమైన పూర్వాభాద్ర నక్షత్రం సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ మండపంపై ప్రత్యేక పూలతో అలంకరించి స్వామి వారి కల్యాణం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

లక్ష్మీగణపతికి శాకంబరి అలంకారం

ఏలూరు కార్పొరేషన్, జూలై 25: సత్రంపాడు లక్ష్మీగణపతి గురువారం వివిధ కూరగాయలతో శాకంబరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామికి భక్తులు గరికతో అర్చన జరిపి బెల్లంనివేదనలు సమర్పించారు. ఆలయఅర్చకులు రాఘవేంద్రశర్మ భక్తులతో పూజలు చేయించారు.



నగరంలో కార్గిల్ విజయ్ దివస్ ర్యాలీ

కార్గిల్ అమర వీరులకు నివాళి

ఏలూరు రూరల్, జూలై 25: కార్గిల్ యుద్ధంలో పాకిస్థాన్‌పై భారత్ సాధించిన విజయాన్ని పురస్కరించుకుని బీజేపీ యువమోర్చా ఆధ్వర్యంలో గురువారం కార్గిల్ విజయ్ దివస్ నిర్వహించారు. యుద్ధంలో అమరులైన సైనికులకు నివాళులర్పించారు. బీజేపీ సీనియర్ నాయకులు అంబికా కృష్ణ మాట్లాడుతూ కార్గిల్ యుద్ధం జరిగి 25ఏళ్ళు పూర్తి అయిందన్నారు. యుద్ధంలో వీరమరణం పొందిన జవాన్లకు ఘన నివాళులర్పించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు చౌటపల్లి విక్రమ్‌కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో సాంస్కృతిక కార్యక్రమాలు

లింగపాలెం, జూలై 25: ధర్మాజిగూడెం పాఠశాల విద్యార్థులు గురువారం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఎంఈవో రామారావు మాట్లాడుతూ శిక్ష సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. విద్యార్థులు చదువుతో పాటు సాంస్కృతిక రంగం, కళలలోనూ అభివృద్ధిని పెంపొందించుకోవాలన్నారు. విద్యార్థులు మనుషులంతా ఒక్కటే అన్న భావన బాల్య దశనుంచే పెంపొందించుకోవాలన్నారు. విద్యతో పాటు సాంస్కృతిక కళ కార్యక్రమాల పై అవగాహన కలిగి ఉండాలన్నారు.

మహిళలు పథకాలు సద్వినియోగం చేసుకోవాలి


సదస్సులో మాట్లాడుతున్న సీడీపీవో

చింతలపూడి, జూలై 25: మహిళలు, బాలింతలు, గర్భిణులు, బాలికలకు ప్రభుత్వం ఇస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ పీవో మాధవి అన్నారు. రాఘవాపురం సెక్టార్‌లో గురువారం జరిగిన బేటీ బచావో, బేటీ పడావో అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పథకాలతో పాటు చట్టాలపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు చేయవద్దని, లైంగిక వేధింపుల నుంచి రక్షణపొందే చట్టాలను వివరించారు. ప్రతి మహిళ తమ పిల్లలను చదివించాలని సూచించారు. రామలక్ష్మి, ఏఎన్ఎం, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీలు, ఎంఎస్‌కె పాల్గొన్నారు.

కౌలు రైతులు గుర్తింపు కార్డులు పొందాలి

టి.నరసాపురం, జూలై 25: కౌలురైతులు గుర్తింపు కార్డులు పొందాలని ఏవో బి.సుమలత సూచించారు. గురువారం ఆమె మాట్లాడుతూ మండలంలో 3,495 మంది కౌలు రైతులు కౌలు గుర్తింపు కార్డులు పొందాల్సి ఉండగా, నేటివరకు 1500 మంది గుర్తింపు కార్డులు జారీ చేశామన్నారు.

పామాయిల్ గెలలు అపహరిస్తున్నారు

కామవరపుకోట, జూలై 25: పాతూరులోని పామాయిల్ తోటలో గెలలను అపహరిస్తున్నారని తహసీల్దార్, తడికలపూడి పోలీసులకు రైతులు ఫిర్యాదు చేశారు. పామాయిల్ గెలలు ట్రాక్టర్‌లో తీసుకువెళ్తున్న వారిని అడ్డగిస్తే దుర్భాషలాడారని ఘంటా కోటేశ్వరి ఫిర్యాదులో పేర్కొన్నారు.

సీసీఎల్ఏ దృష్టికి వీఆర్వోల సమస్యలు


సీసీఎల్ఏకు పుష్పగుచ్ఛం ఇస్తున్న నేతలు

ఏలూరు రూరల్, జూలై 25: వీఆర్వోల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు, ఉపాధ్యక్షుడు మిరియాల లక్ష్మీనారాయణ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గురువారం మంగళగిరిలో సీసీఎల్ఏ జి.జయలక్ష్మిని మర్యాదపూర్వకంగా పుష్పగుచ్ఛం అందించారు. వీఆర్వోల సమస్యలను ఆమె దృష్టికి తీసుకువెళ్లగా సానుకూలంగా స్పందించి సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని రవీంద్రరాజు తెలిపారు.

నామినేటెడ్ పదవుల్లో బీజేపీకి సముచిత స్థానం కల్పించాలి

జంగారెడ్డిగూడెం, జూలై 25: ఎన్నికల్లో కూటమి విజయానికి కృషి చేసిన బీజేపీ నాయకులు, కార్యకర్తలకు నామినేటెడ్ పదవుల్లో సముచిత స్థానం కల్పించాలని పట్టణ కమిటీ అధ్యక్షుడు కొప్పాక శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు. పట్టణ కమిటీ సమావేశం కొప్పాక శ్రీనివాసరావు అధ్యక్షతన గురువారం జరిగింది. పార్టీలో సీనియర్ నాయకులకు నామినేటెడ్ పోస్టులలో తగిన ప్రాధాన్యం కల్పించాలని, పట్టణంలో రైతు బజార్ నిర్మించాలని, పట్టణ సమస్యలను ప్రజా ప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని తీర్మానించారు. పలువురు నాయకులు నామినేటెడ్ పదవులకు దరఖాస్తులను పట్టణ అధ్యక్షుడు కొప్పాక శ్రీనివాసరావుకు అందజేశారు. వేమూరి శ్రీనివాస్, తాటికొండ సుధాకర్, తుమ్మలపల్లి బ్రహ్మాజీ, మాడా రామమోహనరావు, కొంచాడ దుర్గాప్రసాద్, గంటా అనురాధ, అడపా రత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆపదలో ఉన్నవారికి ఆపన్నహస్తం : బిషప్ జయరావు


బియ్యం పంపిణీ చేస్తున్న బిషప్

ఏలూరు టూటౌన్, జూలై 25: ఆపదలో ఉన్నవారికి ఆపన్నహస్తం అందించడమే కథోలిక పీఠం ముఖ్య ఉద్దేశమని బిషప్ జయరావు పొలిమేర అన్నారు. బిషప్ హౌస్‌లో జయరావు 11వ పీఠాధిపత్య అభిషేక వార్షికోత్సవం గురువారం నిర్వహించారు. హైదరాబాద్ ఆర్చిపీఠాధిపతి కార్డినల్ పూలా ఆంథోని, ఖమ్మం పీఠాధిపతి ఎస్.ప్రకాశ్, నల్గొండ పీఠాధిపతి థమస్‌కుమార్ పాల్గొన్నారు. బిషప్ జయరావు మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలతో ప్రజలు కష్టాల్లో ఉన్నప్పుడు ఆదుకోడానికి ముందుంటామన్నారు. సోషల్ సర్వీస్ సెంటర్ డైరెక్టర్ ఫాదర్ ఇమ్మానియేలు ఆధ్వర్యంలో వరద బాధితులకు బియ్యం పంపిణీ ప్రారంభించారు. కార్యక్రమంలో సెయింట్ జోసఫ్ డెంటల్ కళాశాల కరస్పాండెంట్ ఫాదర్ మోజెష్, ఫాదర్ రాజు, ఫాదర్ థామస్ స్టీవెన్, గురువులు, సిస్టర్లు, మతపెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు నిత్యావసర సరుకులు పంపిణీ

వేలేరుపాడు, జూలై 25: విశ్రాంత ఎంఈవో ఘట్టమనేని జగన్మోహనరావు ఆయన మిత్రబృందం అల్లూరినగర్ వరద బాధితులైన 83 కుటుంబాలకు బియ్యం, కూరగాయలు, నిత్యావసర సరుకులు, కొవ్వొత్తులు, దుస్తులు అందించారు. సర్పంచ్ రాజారావు ద్వారా గురువారం పంపిణీ చేశారు. జగన్మోహనరావు మాట్లాడుతూ కమ్మరిగూడెంలో బాధితులకు రూ.1.5 లక్షల విలువైన బియ్యం, దుస్తులు, నిత్యావసర సరుకులు అందించామని తెలిపారు. ఎస్కే.గౌస్, గడ్డం ముత్యాలరావు, సిరికొండ రామారావు పాల్గొన్నారు.

250 వరద బాధిత కుటుంబాలకు అన్నదానం

కుక్కునూరు, జూలై 25: దాచారం పునరావాస కాలనీలో 250 వరద బాధిత కుటుంబాలకు గురువారం భోజన వసతి కల్పించారు. మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజుకు చెందిన టీబీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 250 కుటుంబాలకు కూరగాయలు, చిన్నపిల్లలకు పాలు, బిస్కెట్లు పంపిణీ చేశారు. ట్రస్ట్ సభ్యులు తెల్లం విశాల్, ఎంపీపీ సీహెచ్.గీతావాణి, వైస్ ఎంపీపీలు రాజేష్, రామచంద్రం, నరసింహరాజు, రావు వినోద్, రాయి రవీందర్, చంటినాయుడు, సీహెచ్ నవీన్‌వర్మ, తదితరులు పాల్గొన్నారు.

మానవత ఆర్థిక సాయం

భీమడోలు, జూలై 25 : భీమడోలు మానవత ఆధ్వర్యంలో వర్షాలకు దెబ్బతిన్న పలు కుటుంబాలకు ఆర్థిక సహాయం, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. బీసీ కాలనీలోని మీసాల పరసురాముడు, బాతా ఆదిలక్ష్మి, చోడిశెట్టి బేబి, నరసమ్మ, కనకమ్మ, షేక్ మున్నీ, పోలసానపల్లిలో కూన కొండమ్మ ఇళ్లు వర్షాలకు దెబ్బతిన్నాయి. బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు. సీతారామాంజనేయులు, రామిశెట్టి గంగాధర్, పసుపులేటి సాంబశివరావు, పంచగర్ల సత్యనారాయణ, ఉమామహేశ్వరరావు, సత్యనారాయణ, సత్యేంద్ర, గుడివాడ సీతారామాంజనేయులు పాల్గొన్నారు.

ఏలూరు నగరంలో వాహనాల తనిఖీ

ఏలూరు క్రైం, జూలై 25: నగరంలోని అధికారులు ప్రధాన కూడళ్లలో గురువారం రవాణాశాఖ అధికారులు వాహనాలను తనిఖీ చేశారు. వాహనాల టాక్స్ చెల్లింపుపై దృష్టి సారించారు. ద్విచక్ర మోటారు వాహనదారులకు హెల్మెట్ ధరించాలని కౌన్సెలింగ్ ఇచ్చారు. వాహనాలకు సంబంధించిన బీమా, సీబుక్ ఇతర ధ్రువపత్రాలను క్షుణ్ణంగా పరిశీలించారు.

● కామవరపుకోట: ఏలూరు-జంగారెడ్డిగూడెం రోడ్డులో తడికలపూడి వద్ద గురువారం ఎస్ఐ జయబాబు, సిబ్బంది వాహనాలను తనిఖీ చేశారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడుపుతున్న వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. వాహనదారుల వద్ద అన్ని పత్రాలు ఉండాలని ఎస్ఐ సూచించారు.

మోటార్లతో వర్షపు నీరు తొలగింపు

పోలవరం, జూలై 25: పోలవరం గ్రామం పల్లపు ప్రాంతాలలో వర్షపు నీటిని మోటార్లతో బయటకు తోడించారు. పంచాయతీ కార్యదర్శి వై కొండలరావు ఆధ్వర్యంలో గురువారం మోటార్లతో నీటిని తోడించారు. బీసీ కాలనీలో ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఉన్న నీటిని మోటార్లతో తోడించి తూరలు వేసి ముంపు సమస్య పరిష్కరించారు. పాఠశాల ఆవరణ బయట కట్టి ఉంచిన గేదెలను అక్కడి నుంచి తొలగించారు. బాపూజీ కాలనీ, జగన్నాథపేట, కొత్తపేట, యడ్లగూడెం, నూతనగూడెం ప్రాంతాల్లో మోటార్లు ఏర్పాటు చేసి నిల్వ ఉన్న వర్షపు నీటిని తొలగిస్తున్నారు.

సంక్షిప్త సమాచారం..

- **ఏలూరు టూటౌన్ :** గురుపౌర్ణమి వేడుకల్లో గడియారపు స్తంభం వద్ద నగరపాలక సంస్థ కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్.పెదబాబు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్పొరేటర్ కే.శ్రీనివాసరావు, సబ్బన శ్రీనివాసరావు, ఈదుపల్లి పవన్, నున్న కిశోర్, పాల్గొన్నారు.
- **ఏలూరు రూరల్ :** కోటదిబ్బ సబ్‌స్టేషన్ పరిధిలో వార్షిక మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని ఈఈ నటరాజన్ తెలిపారు.
- **చింతలపూడి :** వ్యవసాయ సీజన్‌లో దమ్ముచక్రాలతోనే రోడ్లపైకి వస్తున్నారని, చర్యలు తీసుకుంటామని రోడ్డు భవనాల శాఖ ఏఈ సొంగా సుందర్‌రావు హెచ్చరించారు.
- **లింగపాలెం :** ఇటీవల గుండెపోటుతో మరణించిన మండల పరిషత్ సీనియర్ అసిస్టెంట్ సత్యరాజుకు సిబ్బంది నివాళులర్పించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.
- **బుట్టాయగూడెం :** కొత్తపేటలో అనారోగ్యంతో బాధపడుతున్న బల్లే కుమారికి వసుధ ఫౌండేషన్ ప్రతినిధులు చోడే ఫణిచంద్రశేఖర్, కొండపల్లి పండు, కొండేపాటి రామకృష్ణలు రూ.20 వేలు అందజేశారు.
- **జంగారెడ్డిగూడెం :** నంద్యాలలో జరగనున్న డివైఎఫ్ఐ రాష్ట్ర స్థాయి శిక్షణా తరగతులకు జిల్లా నుంచి 14 మంది ప్రతినిధులు హాజరవుతున్నారని జిల్లా కార్యదర్శి జి.సూర్యకిరణ్ తెలిపారు.
- కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయ కార్మికుల ఊసేలేదని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కుంచె వసంతరావు అన్నారు. వ్యవసాయ కార్మికులకు కనీస వేతనం, ఉపాధిహామీ నిధులు గానీ బడ్జెట్‌లో పెట్టలేదన్నారు. ఉపాధి పని దినాలు 200 రోజులకు పెంచాలన్నారు.
- **ఉంగుటూరు :** తిమ్మయ్యపాలెంలో ఏర్పాటుచేసిన పంచాయతీ బోర్డులో సర్పంచ్ సింహాద్రి శ్రీదేవి, భర్త సత్యనారాయణల బొమ్మను చించివేయడంపై వారు ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ సర్పంచ్ కావడంతో ఇలా చించివేయడం తగదని వారన్నారు.

నరకానికి నకళ్లు

- వణుకు పుట్టిస్తున్న రహదారులు
- వర్షాలకు మరింత ఛిద్రం
- ఐదేళ్లుగా వైసీపీ గాలికొదిలేయడంతో ప్రజల పాట్లు
- కొత్త ప్రభుత్వంపైనే కోటి ఆశలు



చెరువును తలపిస్తున్న చాట్రాయి–బూరుగ్గూడెం రహదారి

చాట్రాయి: మండలంలో అన్ని గ్రామాల్లో రహదారులు అధ్వానంగా ఉన్నాయి. వారం రోజుల పాటు కురిసిన వర్షాలకు గోతుల్లో నీరు నిలిచి వాహనాల తాకిడికి పెద్ద పెద్ద గోతులు ఏర్పడి అందులో నీరు నిలిచి చెరువులను తలపిస్తున్నాయి. మండల కేంద్రం చాట్రాయి పరిధిలో గ్రామ కూడలికి సమీపంలో బూరుగ్గూడెం వెళ్ళే ఆర్‌అండ్‌బీ రహదారి పూర్తిగా ధ్వంసమైంది. భారీ గంతలు పడి అందులో నీరు నిలిచి దారుణంగా తయారైంది. ఈ రోడ్డుపై నడవటానికి ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు.



రహదారులు ప్రజలకు దడ పుట్టిస్తున్నాయి. బయటకు వెళ్లాలంటే సాహసం చేయాల్సిందే. ఐదేళ్ల వైసీపీ పాలనలో రహదారుల అభివృద్ధిని మరచిపోవడం ప్రజలకు శాపంగా మారింది. అసలే అంతంతమాత్రంగా ఉన్న రహదారులు చినుకు పడితే ఛిద్రమై వాహనదారుల వెన్నులో వణుకు పుట్టిస్తున్నాయి. రహదారిపై గోతులు వర్షం నీటితో నిండి చెరువులను తలపిస్తున్నాయి. పలువురు ఈ గోతుల్లో పడి క్షతగాత్రులయ్యారు. ఇదిగో రహదారుల దుస్థితి చూడండి. కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వమైనా తక్షణం రహదారులను అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

మట్టిరోడ్డు కాదు.. ఆర్‌అండ్‌బీ రహదారే!

మండవల్లి: మండలంలోని ఇంగిలిపాకలంక-పెనుమాకలంక ఆర్‌అండ్‌బీ రహదారి మట్టిరోడ్డుకంటే దారుణంగా ఉంది. చినుకు పడితే చాలు బురదమయమే. వాహనదారులు ఈ రోడ్డుపై వెళ్లేందుకు నరకయాతన అనుభవిస్తున్నారు. పాదచారులు అడుగు తీసి అడుగు వెయ్యాలంటే ప్రాణసంకటమే. మండవల్లి నుంచి ఇంగిలిపాకలంక మీదుగా కొల్లేటి లంక గ్రామాలైన శ్రీరామనగర్, నందిగామలంక, పెనుమాకలంక గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారి ఆర్‌అండ్‌బీ రహదారి ఖాతాలో ఉన్నప్పటికీ వైసీపీ ప్రభుత్వంలో మరమ్మతులైనా చేపట్టకపోవడంతో తారు రోడ్డు మట్టిరోడ్డు కంటే దారుణంగా మారింది.

ఇంగిలిపాకలంక–పెనుమాకలంక ఆర్‌అండ్‌బీ రహదారి



ఆగిరిపల్లి హైస్కూల్ నుంచి తోటపల్లి వరకు గన్నవరం రోడ్డు దుస్థితి

ఆగిరిపల్లి: నూజివీడు జోన్ మొత్తంలో కనిష్ఠ వర్షపాతం నమోదైన ఆగిరిపల్లిలో రోడ్లు ఛిద్రమై గత ప్రభుత్వ డొల్లతనానికి అద్దం పడుతున్నాయి. వర్షపాతం నమోదు చాలా తక్కువగా ఉన్నప్పటికీ రోడ్లు చెరువుల్లా మారాయి. ఆగిరిపల్లి మెయిన్‌రోడ్డు మొత్తం సిమెంట్ రోడ్డు చేసినప్పటికీ గుత్తేదారునికి రావలసిన బిల్లు రాక రోడ్డులో నాణ్యత లోపించి కొద్దిపాటి వర్షాలకే కంకర బయటకు వచ్చి రాళ్ళు తేలుతున్నాయి. రహదారుల దుస్థితికి గత ప్రభుత్వం వైఫల్యమే కారణమని ప్రజలు వాపోతున్నారు.



ఏలూరు ప్రధాన రహదారిలో సింహాద్రిపురం వద్ద రహదారి దుస్థితి

అధ్వానంగా నూజివీడు-ఏలూరు ప్రధాన రహదారి

ముసునూరు: నూజివీడు నుంచి ముసునూరు మండలంలోని పలు గ్రామాలను కలుపుతూ ఏలూరు వెళ్ళే ప్రధాన రహదారి పూర్తిగా దెబ్బతింది. సింహాద్రిపురం, గోపవరం, వేల్పుచర్ల తదితర గ్రామాల ప్రధాన కూడళ్ళలో పెద్దపెద్ద గుంతలు ఏర్పడి, వర్షం కురిస్తే చిన్నపాటి చెరువులను తలపిస్తున్నాయి. ఈ ప్రధాన రహదారి అభివృద్ధికి రూ. 23 కోట్లు మంజూరయ్యాయని రేండేళ్ళ క్రితం అట్టహాసంగా నాటి ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు శంకుస్థాపన చేయగా, మార్జిన్ వర్క్ మాత్రం కొంత మేరకు చేసి, రూ. కోటి బిల్లులు చేయించుకుని కాంట్రాక్టర్ పనులు నిలిపివేశారు. గత ప్రభుత్వంలో ఈ రహదారి అభివృద్ధి కోసం టెండర్ పిలిచినా ఎవరూ వేయలేదని ఆర్‌అండ్‌బీ అధికారులు చెప్పడం విశేషం.



వడాలి సెంటర్‌లో ధ్వంసమైన ప్రధాన రహదారి

ముదినేపల్లి: ముదినేపల్లి-బంటుమిల్లి ప్రధాన రహదారిలో వడాలి గ్రామ సెంటర్‌లో రహదారి ప్రమాదకరంగా ఉంది. పెద్ద గోతులతో నిండి ఉన్న ఆ రహదారిపై వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందికరంగా ఉంది. రోడ్డు ఆక్రమణలకు గురి కావటంతో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు బయటకు పోయే మార్గం లేదు. రహదారి పక్కనే పోలిమేర కోడు డ్రైన్ ఉన్నా ఆ డ్రైన్‌లోకి నీరు వెళ్లే మార్గం లేదు. మూడేళ్లుగా రోడ్డు లోయలా తయారవుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రజలు నరకం చూస్తున్నారు.

కలిదిండి: కొండంగి - మట్టగుంట ప్రధాన రహదారి 7 కిలోమీటర్ల మేర పెద్ద గోతులు పడి అధ్వానంగా ఉంది. గోతుల్లో వాహనాలు దిగబడివ గంటల తరబడి ట్రాఫిక్ స్తంభించిపోతోంది. చేపలు, రొయ్యల చెరువులు అధికంగా ఉండటంతో నిత్యం భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. పెద్ద గోతులు పడటంతో వాహనదారులు పలు అవస్థలు పడుతున్నారు. రహదారిపై కనీసం ఆటోలు కూడా రాకపోకలు సాగించకపోవటంతో ప్రయాణికులు నరకయాతన అనుభవిస్తున్నారు.



చెరువును తలపిస్తున్న కొండంగి - మట్టగుంట ప్రధాన రహదారి



ఆలపాడులో రహదారిపై గుంతల్లో నీరు నిలిచిన దృశ్యం

చెరువులను తలపిస్తున్న రహదారులు

కైకలూరు: వాయుగుండం ప్రభావంతో కురిసిన భారీ వర్షంతో రహదారులు అధ్వానంగా మారాయి. వైసీపీ హయాంలో రహదారులు మరమ్మతులకు కూడా నోచుకోకపోవడంతో రహదారులు పూర్తిగా విచ్ఛిన్నం అయ్యాయి. కైకలూరు మండలం ఆలపాడు నుంచి కొల్లేటికోటకు వెళ్లే రహదారి ఇందుకు ఉదాహరణ. ఆలపాడులో పెద్దపెద్ద గోతులు ఏర్పడడంతో వర్షపునీరు చేరి చెరువులను తలపిస్తోంది. దీంతో ప్రయాణీకులతో పాటు కొల్లేటికోట పెద్దింటి అమ్మవారి ఆలయానికి వెళ్లే భక్తులు సైతం ఇబ్బందులకు గురవుతున్నారు. అలాగే పెంచికలమర్రు నుంచి సర్కారు కాలువ వరకు రహదారి అధ్వానంగా మారడంతో ద్విచక్ర వాహనదారులు, ఆటోవాలాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కూటమి ప్రభుత్వం తక్షణమే స్పందించి రహదారులకు కనీస మరమ్మతులు నిర్వహించాలని ప్రజలు, భక్తులు కోరుకుంటున్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఓవర్ హెడ్ ట్యాంక్‌ను పరిశీలించిన ప్రొఫెసర్లు



కలిదిండి, జూలై 25 : మండలంలోని పెదలంక గ్రామంలో కూలేందుకు సిద్ధంగా ఉన్న ఓవర్ హెడ్ ట్యాంక్‌ను భీమవరం ఎస్‌ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కాలేజీ ప్రొఫెసర్లు గురువారం పరిశీలించారు. 'ఆంధ్రజ్యోతి'లో పొంచి ఉన్న ప్రమాదం శీర్షికన జూలై 4న ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించి ఎస్‌ఆర్‌కెఆర్ ప్రొఫెసర్లతో గురువారం పెదలంకలో శిథిలావస్థకు చేరిన ఓవర్ హెడ్ ట్యాంక్‌ను పరిశీలించారు. ఓవర్ హెడ్ ట్యాంక్ తొలగింపునకు అనుమతులు మంజూరు కాగానే వెంటనే తొలగిస్తామని సర్పంచ్ మోకా లక్ష్మీ రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి నాగబాబు తెలిపారు.

లంక గ్రామాలకు బస్సు ఏర్పాటు

కలిదిండి, జూలై 25 : మండలంలో లంక గ్రామాలకు గురువారం ఆర్టీసీ అధికారులు బస్సును ఏర్పాటు చేశారు. ఆంధ్రజ్యోతిలో గురువారం "లంక గ్రామాలకు రాని బస్సులు" శీర్షికన ప్రచురితమైన కథనానికి ఆర్టీసీ అధికారులు స్పందించారు. విజయవాడ డిపోకు చెందిన పల్లె వెలుగు బస్సు పది రోజులుగా లంక గ్రామాలకు నిలుపుదల చేయటంతో ప్రయాణీకులు అవస్థలు పడ్డారు. కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ చొరవతో కూటమి నాయకులు, రైతులు స్వచ్ఛందంగా లంక గ్రామాల ప్రధాన రహదారికి 15 కిలోమీటర్ల మేర మరమ్మతులు చేయటంతో భీమవరం, గుడివాడ, ఏలూరు డిపో బస్సులతోపాటు విజయవాడ డిపోకు చెందిన బస్సు కూడా రావటంతో లంక గ్రామాల ప్రజలు ఆంధ్రజ్యోతి కృతజ్ఞతలు తెలిపారు.



నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం

నూజివీడు టౌన్, జూలై 25: కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి తీవ్ర అన్యాయం జరిగిందని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు జి.రాజు అన్నారు. సీపీఎం ఆధ్వర్యంలో కేంద్ర బడ్జెట్‌పై గురువారం స్థానిక చిన్న గాంధీ బొమ్మ సెంటర్లో నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ బడ్జెట్‌లో వెనుకబడిన జిల్లాలకు నిధుల ప్రస్తావన లేదన్నారు. కడప ఉక్కు పరిశ్రమ, విశాఖ రైల్వే జోన్లకు కనీస కేటాయింపులు లేవని, పెట్టుబడిదారులకు, కార్పొరేట్ కంపెనీలకు మేలు చేసే విధంగా బడ్జెట్ ఉందన్నారు. సీపీఎం పట్టణ కార్యదర్శి ఎన్.ఆర్. హనుమాన్, సీపీఎం నాయకులు దుర్గారావు, మరియదాసు, పద్మాంజలి పాల్గొన్నారు.

వ్యవసాయంపై చిన్నచూపు

చాట్రాయి, జూలై 25: కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయానికి కేవలం 2.5 శాతం మాత్రమే కేటాయించి అన్నదాతలను చిన్నచూపు చూశారని సీపీఐ (ఎంయల్) లిబరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డి. హరనాథ్ ఆరోపించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం అన్ని పంటలకు మద్దతు ధర, రైతు రుణమాఫీ, రైతులకు పెన్షన్, కిసాన్ సమ్మాన్ నిధి పెంపు మొదలైన డిమాండ్లను బడ్జెట్‌లో పట్టించుకోకపోవటం అన్యాయమన్నారు. పనులు లేని సమయంలో కూలీలకు ఊరట నిస్తున్న ఉపాధి పథకంలో కేటాయింపులలో కోత పెట్టటం శోచనీయమన్నారు.

ఆంజనేయ స్వామికి అభిషేకాలు



ముదినేపల్లి, జూలై 25 : ముదినేపల్లి మారుతీ నగర్ లోని సువర్చలా సమేత భక్తాంజనేయ స్వామికి గురువారం పెద్ద సంఖ్యలో భక్తులు పూజలు నిర్వహించారు. స్వామి జన్మనక్షత్రం పూర్వాభాద్ర కావటంతో అభిషేకాలు నిర్వహించారు. స్థానిక ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మాడుగుల పూర్ణచంద్రరావు, వాసవీ సేవా దళ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వత్తుమిల్లి ప్రసాద్ ఆధ్వర్యంలో అర్చకుడు బృందావనం పద్మాకర్ పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

జూదరుల అరెస్ట్

ఆగిరిపల్లి, జూలై 25: ఆగిరిపల్లి మెట్టకోనేరు సమీపంలో జూదమాడుతున్న 9 మంది నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ. 4 వేలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై సురేంద్రకుమార్ బుధవారం తెలిపారు.

గంజాయి నివారణకు ప్రత్యేక బృందాలు : ఎస్పీ



రూరల్ పోలీస్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ శివ కిషోర్

నూజివీడు టౌన్, జూలై 25: గంజాయి నిర్మూలనకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి చర్యలు చేపడుతున్నట్టు జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివ కిషోర్ చెప్పారు. నూజివీడు సబ్ డివిజన్ పరిధిలోని పోలీస్ స్టేషన్లను గురువారం ఆయన పరిశీలించి మాట్లాడుతూ అవగాహన కోసం జిల్లాలోని పోలీస్ స్టేషన్లను పరిశీలిస్తున్నామన్నారు. ఏలూరు జిల్లాలో గంజాయి నివారణకు ప్రత్యేక దృష్టి సారించి స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆయనకు డీఎస్పీ లక్ష్మయ్య రూరల్, పట్టణ సీఐలు రామకృష్ణ, మూర్తి పుష్పగుచ్ఛాలు ఇచ్చి ఆహ్వానించారు.

ట్రిపుల్ ఐటీలో విద్యార్థులతో ముఖాముఖి

విద్యార్థులు తమ మేధస్సును రాష్ట్ర, దేశాభివృద్ధికి ఉపయోగించాలని ఎస్పీ కె.ప్రతాప్ శివ కిషోర్ సూచించారు. నూజివీడులో గురువారం ట్రిపుల్ ఐటీ విద్యార్థులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 'విద్యార్థులు ఉన్నత శిఖరాలకు అధిరోహించేందుకు కావాల్సిన స్కిల్స్‌పై దృష్టి పెట్టాలి. అప్లికేషన్ డెవలప్‌మెంట్, ప్రొడక్టు డెవలప్‌మెంట్‌పై దృష్టి పెడితే ఇంటర్న్‌షిప్ ద్వారా మెరుగైన ఉపాధి సాధించవచ్చు. ట్రిపుల్ ఐటీల్లో గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు సమాజాన్ని దగ్గర నుంచి చూసే అవకాశం ఉంది. సమాజంలోని సమస్యలను యూ ట్యూబ్, చాట్ జీపీటీ లాంటి వాటి ద్వారా సాంకేతికతతో మేళవిస్తే ప్రతి రంగంలో రాణించవచ్చన్నారు. ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ చంద్రశేఖర్ ఎస్పీని సత్కరించారు. డీఎస్పీ జి.లక్ష్మయ్య, డీన్ ఆఫ్ అకడమిక్ రత్నాకర్, ఫైనాన్స్ ఆఫీసర్ శ్రీనాథ్, పీఆర్వో సురేష్ పాల్గొన్నారు.

నెలాఖరులోగా సర్వే పూర్తిచేయాలి : ఎంపీడీవో



కైకలూరు జూలై 25 : ఓడీఎఫ్ యాప్‌లో ప్రతి ఇంటి వివరాలను నమోదు చేయాలని ఎంపీడీవో ఉమామహేశ్వరరావు అన్నారు. గురువారం కైకలూరులో ఇంటింటి సర్వేపై పంచాయతీ కార్యదర్శులకు, సచివాలయ సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించి మాట్లాడుతూ 2011వ సంవత్సరం జనాభా లెక్కల ప్రకారం కైకలూరు మండలంలో 24443 నివాసగృహాలు ఉన్నట్లు గుర్తించారని ఇప్పుడు సిబ్బంది ఇంటింటికి సర్వే నిర్వహించి ప్రతి ఇంటి యజమాని పేరును యాప్‌లో నమోదు చేయాలన్నారు. గతంలో లేని పేర్లను గుర్తించి కచ్చితంగా వివరాలను పొందుపరచాలన్నారు. వీటితో పాటు ప్రతి ఇంటికి వ్యక్తిగత మరుగుదొడ్డి, నీటి కుళాయి, డ్రైనేజీ సౌకర్యం ఉన్నదీ లేనిది గుర్తించాలన్నారు. అలాగే మండలంలోని 26 గ్రామ పంచాయతీల్లో శివారు ప్రాంతాలు యాప్‌లో నమోదు కాకపోతే ఈవోపీఆర్డీ యాప్ నుంచి అప్‌లోడ్ చేయాలన్నారు. ఈ నెల 31వ తేదీ లోపు పూర్తిస్థాయిలో సర్వేను పూర్తిచేయాలని ఆదేశించారు. ఈవోపీఆర్డీ రవిశంకరరావు పాల్గొన్నారు.

కౌలు రైతులకు రుణాలివ్వండి



ముసునూరు, జూలై 25: కౌలు గుర్తింపుకార్డు ఉన్న ప్రతి కౌలు రైతుకు పంట రుణాలు ఇచ్చేలా బ్యాంక్‌లు సహకరించాలని మండల వ్యవసాయ అధికారి ఎస్.మధు మోహన్ కోరారు. గురువారం చెక్కపల్లి ఎస్‌బీఐ మేనేజర్ ప్రవీణ్‌కుమార్‌ను కలిసి కౌలురైతుల జాబితాను అందజేశారు. నిబంధనల ప్రకారం రుణాలు మంజూరు చేసేలా చూస్తామని ఎస్‌బీఐ మేనేజర్ తెలిపారు. అలాగే వివిధ గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్, సహకార బ్యాంకుల నుంచి కౌలు రైతులకు పంటరుణాలు ఇప్పించేలా చర్యలు తీసుకుంటున్నామని ఏవో తెలిపారు. వీహెచ్‌ఏ సాత్విక, రైతు నాయకులు తల్లిబోయిన సత్యనారాయణ, కాటేపల్లి సత్యనారాయణ, తుమ్మల సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

నేడు అక్కిరెడ్డిగూడెంలో ఆధార్ ప్రత్యేక శిబిరం

ముసునూరు, జూలై 25: ముసునూరు గ్రామ సచివాలయంలో ఆధార్ ప్రత్యేక క్యాంప్‌ను గురువారం నిర్వహించారు. ఈ క్యాంప్‌లో ఆధార్ సేవలను ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి పరిశీలించి, డిజిటల్ అసిస్టెంట్‌లకు సూచనలు ఇచ్చారు. శుక్రవారం ఉదయం 10గంటల నుండి సాయంత్రం 5గంటల వరకు అక్కిరెడ్డిగూడెం సచివాలయంలో ఆధార్ ప్రత్యేక క్యాంప్ జరుగుతుందని ఎంపీడీవో తెలిపారు.

అలరించిన విద్యార్థులు



చాట్రాయి, జూలై 25: మండలంలోని తుమ్మగూడెం ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో గురువారం శిక్షా సప్తాహ్‌లో భా గంగా సాంస్కృతి దినోత్సవం నిర్వహించారు. తెలుగు తల్లి, అంబేడ్కర్, భగత్ సింగ్, నెహ్రూ, డాక్టర్ సర్వేపల్లి రాధా కృష్ణన్ వస్త్రధారణలతో విద్యార్థులు అలరించారు.

ముసునూరు: క్రీడలతో మానసిక ఉల్లాసంతోపాటు శరీర దృఢత్వం సమకూరుతుందని హెచ్‌ఎం రామకృష్ణరాజు అన్నారు. గురువారం శిక్షా సప్తాహ్‌లో భాగంగా క్రీడలు నిర్వహించారు.

ముదినేపల్లి: శిక్షా సప్తాహ్ కార్యక్రమాల్లో భాగంగా గురువారం ముదినేపల్లి మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో సాంస్కృతిక దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థినులకు వివిధ నృత్యాల్లో పోటీలు నిర్వహించారు.

మండవల్లి: మండవల్లి మండలం అయ్యవారిరుద్రవరం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సాంస్కృతిక దినోత్సవం సందర్భంగా చిన్నారుల వేషధారణ పలువురు విశేషంగా ఆకర్షించింది. చిన్నారులను ప్రధానోపాధ్యాయుడు పిచ్చయ్య తో పాటు పలువురు అభినందించారు.

బడి బయట బాలుడు.. బడిబాట



ఆగిరిపల్లి, జూలై 25: బడికిపోతా కార్యక్ర మంలో భాగంగా గురువారం ఉదయం ఆగిరిపల్లి బస్టాండ్ ఆవరణలో తిరుగుతున్న బట్టు ఫణికుమార్ అనే బాలుడిని ఆగిరిపల్లి ఎంఈవో -2 కొవ్వలి ఆనంద్‌కుమార్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం పుష్పలతతో మాట్లాడి 4వ తరగతిలో చేర్పించినట్టు తెలిపారు. 14 సంవత్సరాలు లోపు పిల్లలు ఖచ్చితంగా బడిలోనే ఉండాలని కోరారు.

స్వయం ఉపాధితోనే మహిళా సాధికారత



కైకలూరు, జూలై 25 : స్వయం ఉపాధితోనే మహిళా సాధికారత సాకారం అవుతుందని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ మాజీ అధ్యక్షుడు కొండ్రెడ్డి సత్యనారాయణ అన్నారు. కైకలూరు శ్రీసత్యసాయి సేవా సమితిలో 37 రోజులుగా మహిళలకు మగ్గం, జర్దోసిపై జరుగుతున్న ఉచిత శిక్షణా తరగతులు గురువారంతో ముగిసాయి. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ శిక్షణకు సహకరించిన సత్యసాయి సేవా సంస్థ, బైరెడ్ సంస్థల సేవలు అభినందనీయమన్నారు. బైరెడ్ సంస్థ ద్వారా ధ్రువీకరణ పత్రాలను అందించారు. ఈ పత్రాల ద్వారా బ్యాంకర్ల నుంచి రుణాలు పొందవచ్చని సూచించారు. బైరెడ్ అసిస్టెంట్ డైరెక్టర్ జి. రామారావు, సత్యసాయి సేవా సంస్థల ఏలూరు జిల్లా అధ్యక్షుడు కె. శశిశేఖరరావు, మానవత సంస్థ అధ్యక్షురాలు కొండ్రెడ్డి చిట్టెమ్మ, కైకలూరు ప్రముఖులు పాల్గొన్నారు.

27,28 తేదీల్లో రాష్ట్రస్థాయి చెస్ క్రీడాకారుల ఎంపిక

భీమవరం అరన్, జూలై 25: అనసూయ చెస్ అకాడమి ఆధ్వర్యంలో ఆంధ్ర, జిల్లా అసోసియేషన్ సహకారంతో ఈనెల 27, 28 తేదీల్లో రాష్ట్రస్థాయి అండర్-11 ఓపెన్ గరల్స్ చదరంగం పోటీలు-2024 నిర్వహిస్తున్నట్టు జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు మాదాసు కిషోర్ తెలిపారు. భీమవరంలోని ప్యాడీ రైస్ మర్చం ట్స్ హాల్లో జరిగే పోటీల్లో గెలుపొందిన వారు అక్టోబరు 3 నుంచి 13 వరకు హైదారాబాదులో జరిగే జాతీయస్థాయి పోటీల్లో రాష్ట్రం తరఫున ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. వివరాలకు 9063224466లో సంప్రదించాలన్నారు.

28న సబ్ జూనియర్స్ బాస్కెట్‌బాల్ ఎంపిక పోటీలు

ఏలూరు రూరల్, జూలై 25: రాష్ట్ర స్థాయి అంతర్ జిల్లాల సబ్ జూనియర్ మినీ బాస్కెట్‌పోటీలు చిత్తూరు జిల్లాలో ఆగస్టులో జరగనున్నాయి. ఈమేరకు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా బాలబాలికలకు ఈనెల 28న ఏలూరు కస్తూరిబా మున్సి పల్ హైస్కూల్ ప్రాంగణంలో సాయంత్రం మూడు గంటల నుంచి ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్టు ఉమ్మడి జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.కృష్ణారెడ్డి తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు మీసేవలో తీసుకున్న ఒరిజినల్ జనన ధ్రువీక రణ పత్రం, ఆధార్‌కార్డు తీసుకురావాలని సెక్రటరీ శ్రీను, ట్రెజరర్ కె.మురళీకృష్ణ తెలిపారు. మరింత సమాచారానికి 94411 71933 నంబరులో సంప్రదించాలన్నారు.



కార్గిల్ అమరవీరులకు నివాళి

చాట్రాయి, జూలై 25: కార్గిల్ విజయ దివస్‌ను పురస్కరించుకుని చాట్రాయి సెంటర్‌లో గురువారం రాత్రి కార్గిల్ అమరవీరులకు కొవ్వొత్తులతో నాయకులు నివాళులర్పించారు. కార్గిల్ అమరవీరులకు జోహార్, భారత్ మాతాకి జై, జై జవాన్ అంటూ నినాదాలు చేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు ఓబిళ్ళనేని రాజా, నాయకులు గడ్డం సంజీవరెడ్డి, ఆదిమూలం శర్మ, పోతిరెడ్డిపల్లి చెన్నారావు, టీడీపీ నాయకులు రాయవరపు పుల్లారావు, సీతారాములు, కిసాన్ సంఘ్ నాయకులు వేణు, చెన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకుంటే చర్యలు



ఎరువుల డీలర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ

చాట్రాయి, జూలై 25: ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు విక్రయించే డీలర్లు ప్రభుత్వ నిబంధనలు పాటించకపోతే చర్యలు తీసుకుంటామని నూజివీడు డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకుడు విద్యాసాగర్ హెచ్చరించారు. మండలంలో లైసెన్సు కలిగిన డీలర్లకు గురువారం స్థానిక రైతు సేవా కేంద్రంలో అవగాహన సమావేశం నిర్వహించి మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన ఎరువులు అమ్మటంతో పాటు, కచ్చితంగా బిల్లులు ఇవ్వాలన్నారు. రైతులు బిల్లులను అడిగి తీసుకోవాలని సూచించారు. అనంతరం వీఏఏలకు, వీహెచ్‌ఏలకు భూసార పరీక్ష ఆధారిత ఎరువుల యాజమాన్యం గురించి, ఉద్యానశాఖ పథకాలపై అవగాహన కల్పించారు. ఏవో శివ శంకర్, హెచ్‌వో హేమ పాల్గొన్నారు. చాట్రాయిలో వరి పొలాలను ఏడీఏ పరిశీలించారు. ఒడిస, బెంగాల్ కూలీలు వరినాట్లు వరసలుగా వేయటం చూసి ఇది చాలా మంచి విధానమని, స్థానిక కూలీలకు కూడా ఈ విధానంపై అవగాహన కల్పించాలని కోరారు. ఆయన వెంట ఏవో శివశంకర్, సిబ్బంది ఉన్నారు.

ఆర్థిక సాయం అందజేత



చాట్రాయి, జూలై 25: ఆరుగొలనుపేటకు చెందిన అంబోజి రమేష్ నాలుగేళ్ల క్రితం తాటిచెట్టు పై నుంచి పడి చనిపోయాడు. అతనికి భార్య ధనలక్ష్మి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ధనలక్ష్మి పిల్లలను పోషించలేక ఆర్థిక ఇబ్బందులు పడుతుండటంతో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కొమ్ము ఆనందం, ప్రజాతంత్ర మహిళా సంఘం మండల అధ్యక్షురాలు లింగోజు సరిత, యువజన సంఘం మండల నాయకుడు లింగోజు వంశీ, మరికొందరు దాతలు రూ. 16,500ను గురువారం ధనలక్ష్మి ఇంటికి వెళ్ళి అందజేశారు.

నూజివీడులో వైద్య శిబిరం



నూజివీడు టౌన్, జూలై 25: ప్రపంచ హెపటైటిస్ డేను పురస్కరించుకొని నూజివీడు శ్రీ సత్యసాయి సేవా సంస్థ, ఆయుష్ ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఆయుష్ ఆసుపత్రి ఎండీ గోపాలకృష్ణ వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. 122 మందికి వైద్యలందించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. డాక్టర్ రమేష్‌బాబు, డాక్టర్ శ్రీనివాస చౌదరి, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గంగానమ్మకు ఆషాఢ సారె



ముదినేపల్లి, జూలై 25 : శ్రీహరిపురంలోని గంగానమ్మ వారికి గురువారం పెద్ద సంఖ్యలో మహిళలు ఆషాఢ సారె సమర్పించారు. ఆలయ కమిటీ సభ్యుడు నీలం చలమయ్య ఇంటి నుంచి బోనాలతో ఊరేగింపుగా అమ్మవారికి సారె సమర్పించారు.